

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 04 ఆగస్టు 2021 సంపుటి : 03 సంచిక :02 పేజీలు : 4 వెల : రూ 3-00

# తొలి విడతలో 4,530 డిజిటల్ లైబ్రరీల నిర్మాణం: సీఎం జగన్



అమరావతి: వర్క్ ఫ్రం హోం కాన్సెప్ట్‌ను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐటీ శాఖ, డిజిటల్ లైబ్రరీపై సీఎం వైఎస్ జగన్ మంగళవారం తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. గ్రామాలకు మంచి సామర్థ్యం గల ఇంటర్నెట్ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రైమరీ, సెకండరీ ఎడ్యుకేషన్‌తోపాటు.. గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఉపయోగకరంగా డిజిటల్ లైబ్రరీలు ఉండాలని అధికారులకు సూచించారు. డిజిటల్ లైబ్రరీల్లో కామన్ ఎంట్రన్స్ టెస్టులతోపాటు.. అన్ని రకాల పోటీల పరీక్షలకు అందుబాటులో స్టడీ మెటీరియల్ ఉండాలని అధికారులను ఆదేశించారు.గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలకూ ఇంటర్నెట్ సదుపాయం అందించాలని, నిరంతరం ఇంటర్నెట్ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని, తొలి విడతలో 4,530 డిజిటల్ లైబ్రరీల నిర్మాణం చేపట్టాలన్నారు. ఆగస్టు 15న పనులు ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. ఈలోగా స్థలాలు గుర్తించి హ్యాండోవర్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిసెంబర్ నాటికి డిజిటల్ లైబ్రరీల పనులు పూర్తయ్యేలా.. ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. ఈ సమావేశంలో మంత్రి గౌతమ్‌రెడ్డి, ఐటీ, ఫైబర్ నెట్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.


# అభ్యంతరాలున్న ప్రాజెక్టుల వివరాలివ్వలేం: ఏపీ ఈఎన్‌సీ

హైదరాబాద్: నగరంలోని జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ)ల సమన్వయ కమిటీ భేటీ అయింది. తెలుగు రాష్ట్రాల్లో నదీ జలాల అంశంలో కేంద్ర జల్‌శక్తి శాఖ జారీ చేసిన గెజిట్ ప్రకారం ప్రాజెక్టుల స్వరూపం, ఇతర వివరాలు ఇవ్వాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను బోర్డులు కోరాయి. గెజిట్ నోటిఫికేషన్‌లో చేర్చిన ప్రాజెక్టులపై అభ్యంతరాలు ఉన్నాయని.. వాటిని కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నామని ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) నారాయణరెడ్డి చెప్పారు. అభ్యంతరాలున్న ప్రాజెక్టుల వివరాలు ఇవ్వలేమని తెలిపారు. వివరాలు ఇచ్చి అభ్యంతరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని బోర్డులు సూచించాయి. దీనిపై తమ ప్రభుత్వ నిర్ణయం ప్రకారం నడుచుకుంటామని ఏపీ ఈఎన్‌సీ సమాధానమిచ్చారు. సమన్వయ కమిటీ సమావేశాలు ఇకపై తరచూ జరుగుతుంటాయని బోర్డులు తెలిపాయి. ఆగస్టు రెండో వారంలో బోర్డు పూర్తి సమావేశాన్ని నిర్వహిస్తామని జీఆర్ఎంబీ స్పష్టం చేసింది. సమావేశం అనంతరం ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ గెజిట్ నోటిఫికేషన్‌లోని కొన్ని అంశాలపై మరింత స్పష్టత కోరామని చెప్పారు.అంతకుముందు గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కేంద్ర జల్‌శక్తి శాఖ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ అమలు కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ఈ భేటీకి బోర్డు సభ్య కార్యదర్శి బీపీ పాండే, బోర్డు సభ్యులు, కేంద్ర జల్‌శక్తి శాఖ ప్రతినిధి, ఏపీ ఈఎన్‌సీలు నారాయణరెడ్డి, సతీశ్, ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో ఎండీలు హాజరయ్యారు. ఈ సమావేశానికి తెలంగాణ సభ్యులు హాజరుకాలేదు.

జలసౌధలో కేఆర్ఎంబి, జీఆర్ఎంబి సమన్వయ కమిటీ భేటీ



# విశాఖ ఉక్కు కోసం న్యాయస్థానాలను ఆశ్రయిద్దాం: విజయసాయి రెడ్డి



న్యూఢిల్లీ: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్టీల్ ప్లాంట్ కార్మికులు ఢిల్లీలో వరుసగా రెండో రోజు నిర్వహిస్తున్న ధర్నాకు వైఎస్ఆర్‌సీపీ కాంగ్రెస్ ఎంపీలు మద్దతు తెలిపారు. ఆంధ్రా భవన్ ఆవరణలో మంగళవారం ఉక్కు కార్మికులు చేపట్టిన ఆందోళనకు వారు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నాయకులు విజయసాయిరెడ్డి మాట్లాడుతూ "ఉక్కు కార్మికులకు భరోసా ఇచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు కార్మిక సంఘాలు తలపెట్టిన ఈ ఉద్యమాన్ని ఒక ఏడాది పాటు ఇదేలా కొనసాగిస్తే సార్వత్రిక ఎన్నికలకు గడువు దగ్గర పడుతుంది. ఎన్నికలు ముందు పెట్టుకుని ఏ ప్రభుత్వమూ ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకోదు" అని తెలిపారు. ఒక సంవత్సరం పాటు పోరాటాన్ని కొనసాగించాలంటే మనం అందరం కలిసి సంఘటితంగా పోరాటం చేయాలని విజయసాయిరెడ్డి పిలుపు ఇచ్చారు. అవసరమైతే కోర్టులను ఆశ్రయించి ప్రైవేటీకరణ ప్రక్రియపై స్టే తీసుకురావాలని సూచించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వం నిర్ణయంలోనే అనేక అవకతవకలు ఉన్నాయని.. అవన్నీ ప్రభుత్వంలోని పెద్దలకు తెలుసు అన్నారు. కాబట్టి న్యాయస్థానాల్ని ఆశ్రయించి ఈ ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేయడానికి ప్రయత్నాలు చేయాలని అన్నారు. ఉక్కు కార్మికుల పోరాటంలో తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాఖ ఉక్కు కార్మికులు, ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడాలని ఎల్లవేళలా కోరుకుంటున్నారని విజయసాయి రెడ్డి తెలిపారు.

# ఉచిత రేషన్‌తో లక్షలాది కుటుంబాలకు లబ్ధి : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ : కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో ఉచిత రేషన్ లక్షలాది కుటుంబాలకు ఆసరాగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) లబ్ధిదారులతో ప్రధాని మోదీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముచ్చటించారు. కరోనా మహమ్మారి ప్రభావంతో ఇబ్బందులు పడిన ప్రజలకు అన్ని విధాలుగా సాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. పీఎంజీకేఏవై పథకం పెద్దసంఖ్యలో ప్రజలకు ఉపయోగపడాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని చెప్పారు.గోడౌన్లలో ఆహార ధాన్యాల నిల్వలు పెరుగుతున్నా మరోవైపు ఆకలి, పోషకాహారలోపం ఆ స్థాయిలో తగ్గడం లేదని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పంపిణీ విధానం లేకపోవడమే దీనికి కారణమని చెప్పారు. అనర్హులైన లబ్ధిదారులను వ్యవస్థ నుంచి తొలగించి రేషన్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేశామని తెలిపారు. పీఎంజీకేఏవై పథకం ఈ ఏడాది దీపావళి వరకూ అమల్లో ఉంటుందని, ఈ పథకం ద్వారా గుజరాత్‌లో 3.5 కోట్ల మంది లబ్ధిపొందుతున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# కొత్త రాష్ట్రాల ప్రతిపాదనల్లేవ్.. మూడేళ్లలో 348 కస్టడీ మరణాలు!

### లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర హోంశాఖ

దిల్లీ: కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలేవీ కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేవని కేంద్ర హోంశాఖ స్పష్టంచేసింది. కొందరు వ్యక్తులు, సంస్థల నుంచి అలాంటి డిమాండ్లను ఎప్పటికప్పుడు స్వీకరించినప్పటికీ రాష్ట్రాలను విభజించే ప్రతిపాదనలేవీ కేంద్రం వద్ద లేవని కేంద్ర హోంశాఖ మంత్రి నిత్యానంద్ రాయ్ లోక్‌సభలో వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రాన్నైనా విభజించే ప్రతిపాదన కేంద్రం వద్ద ఉందా అని పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. కొత్త రాష్ట్రాల ఏర్పాటు కోసం పలువురు వ్యక్తులు, సంస్థల నుంచి డిమాండ్లు, అభ్యర్థనలూ ఎప్పటికప్పుడు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. కొత్త రాష్ట్రాల ఏర్పాటు మన దేశ సమాఖ్య రాజకీయాలపై విస్తృతమైన ప్రభావం చూపుతుందన్నారు. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకున్న తర్వాతే కేంద్ర ప్రభుత్వం కొత్త రాష్ట్రాల ఏర్పాటు అంశంలో ముందుకు వెళ్తుందన్నారు. ఇప్పటికైతే అలాంటి ప్రతిపాదనలేవీ కేంద్రం వద్ద లేవని మంత్రి స్పష్టంచేశారు.దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గత మూడేళ్లలో 348 మంది పోలీస్ కస్టడీలో మృతి చెందినట్టు కేంద్రం వెల్లడించింది. అలాగే, పలు కేసుల్లో నిర్బంధించడం ద్వారా 1189 మంది హింసకు గురైనట్టు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ లోక్‌సభకు వెల్లడించారు. జాతీయ మానవహక్కుల కమిషన్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 2018లో 136మంది పోలీస్ కస్టడీలో మృతిచెందగా.. 2019లో 112 మంది, 2020లో 100 మంది ప్రాణాలు విడిచినట్టు పేర్కొన్నారు. అలాగే, పోలీస్ కస్టడీలో చిత్రహింసలకు గురైన వారిలో 2018లో 542మంది ఉండగా.. 2019లో 411మంది, 2020లో 236మంది ఉన్నట్టు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.



# ఏపీలో కొత్తగా 1,546 కేసులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో కరోనా ఉధృతి క్రమంగా తగ్గుతుంది. గడిచిన 24 గంటల్లో ఏపీలో 69,606 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 1,546 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. గత 24 గంటలలో కరోనా బారిన పడి 18 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 13,428 కు చేరింది. గడిచిన 24 గంటల్లో 1,940 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 19,37,956 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంగళవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 20,170 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 19,71,554 కు చేరింది. ఏపీలో ఇప్పటి వరకు 2,47,78,146 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.



## ఆస్తి పన్ను పెంపుపై ప్రతిపక్షాలవి అసత్య ఆరోపణలు: మంత్రి బొత్స

అమరావతి: ఆస్తి పన్ను పెంపుపై ప్రతిపక్షాలవి అసత్య ఆరోపణలు చేస్తున్నాయని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. దళారులు లేకుండా పారదర్శక పన్ను విధానం రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని పన్ను విధానాలనూ పరిశీలించి, అత్యుత్తమ పన్ను విధానాన్నే రాష్ట్రంలో తీసుకొచ్చామని మంత్రి బొత్స పేర్కొన్నారు. తిరుపతి స్మార్ట్ సిటీ అభివృద్ధికి అదనంగా రూ.123 కోట్లు కేటాయించినట్లు మంత్రి బొత్స వెల్లడించారు.



# చంద్రబాబు నిర్వాకంతోనే పెట్రోల్ ధరలు పెరిగాయి

తాడేపల్లి: ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు టీడీపీకి లేదని ఏపీ ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు నిర్వాకంతోనే పెట్రోల్ ధరలు పెరిగాయని చెప్పారు. 2015లోనే చంద్రబాబు పెట్రోల్, డీజిల్‌పై రూ.4 అదనంగా పెంచారని వివరించారు. పెట్రోల్, డీజిల్ ధరలపై టీడీపీ విమర్శలు హాస్యాస్పదమని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఆర్టీసీ ఛార్జీలు కూడా పెంచారని గుర్తుచేశారు. ఆయన హయాంలో రాష్ట్రంలో కరోనా పరిస్థితులు లేవు అని పేర్కొన్నారు. తాడేపల్లిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సజ్జల మాట్లాడుతూ.. 'బాబు హయాంలో ధరలు పెరిగినప్పుడు ఎల్లో మీడియా ఏం చేసింది? బాబు హయాంలో రోడ్ల మరమ్మతులను పట్టించుకోలేదు. బాబు అడ్డంగా దోచుకోవడం వల్లే ఈ పరిస్థితి. రెవెన్యూ తగ్గినా సీఎం జగన్ ప్రజలపై భారం మోపలేదు' అని స్పష్టం చేశారు. 'అమర్‌రాజ్ కంపెనీ విషపూరితమైన కాలుష్యం వెదజల్లుతోంది. ప్రజల ఆరోగ్యం కంటే ప్రభుత్వానికి ఏదీ ముఖ్యం కాదు. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని కోర్టు హెచ్చరించింది. అమర్‌రాజా వ్యవహారంపై ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తోంది. ప్రజలకు హాని కలిగించని పరిశ్రమలు ఉండాలన్నదే సీఎం ఉద్దేశం. ప్రజలకు ఇబ్బంది కలిగించే అన్ని పరిశ్రమలపై చర్యలు ఉంటాయి'.రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉందని సజ్జల తెలిపారు. చంద్రబాబు అప్పులు, కరోనా వల్ల ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని వివరించారు. పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వొద్దని చెప్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి రూపాయి దుబారా అవుతుందా? అని ప్రశ్నించారు. కేంద్రం అప్పులు చేస్తుంది రాష్ట్ర బీజేపీ నేతలకు తెలియదా? అని మండిపడ్డారు.



# సీఎం జగన్‌ను కలిసిన తూర్పు నావికా దళం అధికారి

అమరావతి: తూర్పు నావికా దళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ అజేంద్ర బహదూర్‌సింగ్ మంగళవారం ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌తో పలు విషయాలు ముచ్చటించారు.



# సంపాదకీయం

బుధవారం 04 ఆగస్టు 2021

## ఐదు రాష్ట్రాలపై ఇద్దరు గురి

వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిల్లో యూపీ, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వీటిల్లో కీలకమైన, పెద్ద రాష్ట్రమైన యూపీపైనే అందరి చూపూ ఉంది. తరవాత పంజాబ్ పై ఆసక్తి నెలకొంది. ఇక్కడ హస్తం పార్టీ పాలన సాగుతోంది. ఈశాన్య భారతం లోని మణిపూర్, పశ్చిమ భారతంలోని గోవా పేరుకు చిన్న రాష్ట్రాలైనప్పటికీ రాజకీయంగా ప్రాధాన్యం కలిగినవి. ఈ రెండు చోట్లా జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ లదే కీలక పాత్ర. చిన్న పార్టీలు ఉన్నప్పటికీ వాటి పాత్ర పరిమితమే. దీంతో ఈ రెండు రాష్ట్రాల్లో అధికారాన్ని కాపాడుకునేందుకు కమలనాథులు కసరత్తు చేస్తున్నారు. అదే సమయంలో గత ఎన్నికల్లో ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచినప్పటికీ అనివార్య కారణాల వల్ల అధికారాన్ని అందుకోలేకపోయిన హస్తం పార్టీ ఈసారి పకడ్బందీ వ్యూహరచనతో ముందుకు సాగుతోంది.అరవై సీట్లు గల మణిపూర్ ఈశాన్య భారతంలోని కీలక రాష్ట్రాల్లో ఒకటి. 2017 నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ 28 సీట్లు సాధించి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. అప్పటికే ఆ పార్టీకి చెందిన ఒక్రమ్ ఇబోబీ సింగ్ మూడు దఫాలుగా ముఖ్యమంత్రిగా 15ఏళ్ల నుంచి అధికారంలో కొనసాగుతున్నారు. అప్పటివరకు రాష్ట్రంలో ఉనికే లేని భారతీయ జనతా పార్టీ నాటి ఎన్నికల్లో 21 సీట్లు సాధించింది. నాగా పీపుల్స్ ఫ్రంట్ 4, నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ 4 సీట్లు సాధించి కీలకంగా మారాయి. లోక్ జనశక్తి పార్టీ ఒకచోట, మరోచోట ఇండిపెండెంట్ అభ్యర్థి విజేతగా నిలిచారు. నిబంధనల మేరకు అతిపెద్ద పార్టీ అయిన హస్తం అధికారాన్ని అందుకోవాలి. కానీ కేంద్రంలోని బీజేపీ పెద్దల లాబీయింగ్, గవర్నర్ తమ పార్టీ వారు కావడంతో బీజేపీ ఇంఫాల్ పీఠాన్ని అధిష్టించింది. హింగాంగ్ నుంచి గెలిచిన ఆ పార్టీ నాయకుడు ఎన్. బిరెన్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. మణిపూర్ లో అధికారాన్ని అందుకోవడం కమలానికి అదే తొలిసారి. ఈసారి బీజేపీక అంత తేలిక కాదన్నది విశ్లేషకుల అంచనా.పశ్చిమ రాష్ట్రమైన గోవాలోనూ బీజేపీ మాయోపాయాలతో పనాజీ పీఠాన్ని దక్కించుకుంది. మొత్తం 40 సీట్లకు ఆ పార్టీకి వచ్చినవి 13. అప్పటి వరకు అధికారంలో ఉన్న హస్తం పార్టీ 17 సీట్లు సాధించి ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచింది. మహారాష్ట్ర వాది గోమంతక్ పార్టీ, గోవా ఫార్వర్డ్ పార్టీ, స్వతంత్ర శాసనసభ్యులు, గవర్నర్ అండతో బీజేపీ అధికారాన్ని అందుకుంది. నైతిక విలువలకు మారుపేరైన, ఐఐటీలో విద్యనభ్యసిం చిన మనోహర్ పారికర్ సీఎం పీఠాన్ని అధిష్టించారు. వాస్తవానికి అధికారానికి దూరంగా ఉండాలని పారికర్ అనుకున్నారని, కానీ పార్టీ పెద్దల ఒత్తిడితో పగ్గాలు చేపట్టారన్న అభిప్రాయం అప్పట్లో రాజకీయ వర్గాల్లో ఉంది.రెండేళ్ల అనంతరం పారికర్ మరణంతో 2019లో ప్రమోద్ సావంత్ సీఎం అయ్యారు. ఇప్పుడు ఆయన నాయకత్వంలోనే పార్టీ ఎన్నికలకు వెళ్లనుంది. ఈసారి సకల శక్తులను కూడగట్టుకుని ఎన్నికలకు వెళతామని పీసీసీ చీఫ్ గిరీష్ బోడంకర్ చెబుతున్నారు. రాష్ట్ర పార్టీ పరిశీలకుడైన కర్ణాటకకు చెందిన దినేష్ గూండూరావు పార్టీలోని వివిధ వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. దినేష్ గూండూరావు ఒకప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి ఆర్. గూండూరావు కుమారుడు. 2019లో పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని రెండు సీట్లలో తమ పార్టీ ఒకటి గెలుచుకుందని, ప్రజలు ఏకపక్షంగా బీజేపీ వైపు లేరనడానికి ఇది నిదర్శనమని దినేష్ గూండూరావు తెలిపారు. మోదీ గాలిలోనూ ఉన్న రెండు సీట్లలో ఒకటి మాత్రమే బీజేపీ గెలిచిందని ఆయన గుర్తు చేశారు. అందువల్ల ఈసారి బీజేపీని నిలువరించి తీరుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## కొండపల్లి మైనింగ్ సెగలు

విజయవాడ, ఆగస్టు 3, (న్యూస్ పల్స్)కొండపల్లి కొండను తవ్వింది ఎవరు? తవ్వుకుని లాభపడింది ఎవరు? కొండ కరుగుతున్న సమయంలో రాజకీయ సెగ ఎందుకు రాజుకుంది? పైచెయ్యి సాధించాలనే ఎత్తులు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయా? మాటలతో ఒకరు.. సాంకేతిక అంశాలతో ఇంకొకరు.. ఒకరినొకరు ఇరుకున పెట్టుకునే వ్యూహాలు ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి.కృష్ణాజిల్లా మైలవరం నియోజకవర్గంలో రాజకీయాలు సీజన్‌తో సంబంధం లేకుండా ఎప్పుడూ రగులుతూనే ఉంటాయి. ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో, ఎన్నికల తర్వాత ఇలా పరిస్థితులు ఎలా ఉన్నా వైసీపీ, టీడీపీ మధ్య కస్సుబస్సులు కామన్. దీనికంతటికీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమాలే కారణం. గతంలో నందిగామ కేంద్రంగా జరిగే వ్యవహారాలు ఇప్పుడు మైలవరానికి షిఫ్ట్ అయ్యాయి తప్ప.. మిగతాదంతా సేమ్ టు సేమ్. తాజాగా వీరిద్దరి మధ్య వివాదం తారాస్థాయికి చేరుకోవటానికి ప్రధాన కారణం కొండపల్లి క్వారీయింగ్. టీడీపీ హయాంలో అక్రమంగా తవ్వేశారంటే.. కాదు వైసీపీ హయాంలోనే తవ్వేశారని పరస్పరం ఆరోపణల పర్వం కొనసాగుతోంది. ఇప్పుడది మరింత పీక్‌కు వెళ్లింది.గత ప్రభుత్వ హయాంలోనూ కొండపల్లిలో మైనింగ్ జరిగింది. ఆ అంశంపైనే వైసీపీ సర్కార్ ఇప్పుడు ప్రధానంగా ఫోకస్ పెట్టింది. దేవినేని ఉమా మంత్రిగా ఉన్న సమయంలో ఆయన స్వయంగా వచ్చి క్రషర్లు ప్రారంభించారు. వాటికి సంబంధించిన ఫొటోలను, వీడియోలను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్నాయి వైసీపీ శ్రేణులు. టీడీపీకి చెందిన కొందరు నాయకులకు కూడా ఇక్కడ మైనింగ్ ఉంది. రెవెన్యూ భూమి కావడంతో మైనింగ్ చేస్తున్నామంటున్నారు టీడీపీ నాయకులు. దేవినేని ఉమా ఎందుకు అటవీ భూమిగా ఆరోపిస్తున్నారో తెలియడం లేదని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. ఆ వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. అధికారపార్టీని ప్రశ్నిస్తున్న టీడీపీని ఇరకాటంలో పెట్టేందుకు ఈ వీడియోలను, ఫొటోలను అస్త్రాలుగా సంధిస్తోంది వైసీపీ.కొండపల్లి క్వారీయింగ్‌లో రెండు ప్రభుత్వాల హయాంలో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరిగిందనే వాదన ఉంది. వైసీపీ హయాంలో జరిగిన మైనింగ్‌కు సంబంధించి ఇప్పటికే ఒకసారి 10 లక్షల ఫైన్ వేశారు.

8 జేసీబీలు, 7 టిప్పర్లను సీజ్ చేశారు. అయితే గత ఐదేళ్లకాలంలో అటవీ భూముల్లో జరిగిన మైనింగ్‌కు వైసీపీయే కారణమన్న ఉమా ఆరోపణలకు చెక్ పెట్టడానికి అధికారపార్టీ గట్టి హోంవర్క్ చేస్తోందట. 2014 నుంచి 2019 వరకు వివాదాలకు కేంద్రంగా ఉన్న 143, 26/1 సర్వే నంబర్లలో జరిగిన తవ్వకాలపై గూగుల్ మ్యాపింగ్‌ను వైసీపీ బయటకు తీసింది. ఏటా ఆ సర్వే నంబరులో జరిగిన మార్పులను ప్రజల ముందు పెడుతోంది. వైసీపీ హయాంలో నిబంధనలకు మించి జరిగిన మైనింగ్‌పై ఇప్పటికే అధికారులు చర్యలు తీసుకున్నారు. అందువల్ల గూగుల్ చిత్రాల ఆధారంగా.. సాంకేతిక అంశాలను ఒడిసిపట్టి మాజీ మంత్రి ఉమాపై చర్యలు తీసుకోవడానికి వైసీపీ సిద్ధమవుతున్నట్టు సమాచారం. దీంతో కొండపల్లి మైనింగ్ ప్రాంతానికి వెళ్లి వేరే కేసులో ఇరుక్కున్న ఉమాను.. ఈ విషయంలో పక్కగా కార్నర్ చేయబోతోంది. మరి.. ఈ రగడ రానున్న రోజుల్లో ఇంకెన్ని మలుపులు తీసుకుంటుందో చూడాలి.

## వైసీపీ ఎంపీలపై బీజేపీ కన్ను

విజయవాడ, ఆగస్టు 3, (న్యూస్ పల్స్)వైసీపీకి ఈసారి పాతిక ఎంపీ సీట్లు వస్తాయా. అంటే అవును అన్న మాట సొంత పార్టీలో వినిపిస్తోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుచుకున్న 22 సీట్లతో పాటు టీడీపీ సీట్లు మూడింటినీ కూడా గెలుచుకోవడానికి వైసీపీ మాస్టర్ ప్లాన్ వేస్తోంది. ఏపీలో టీడీపీని తుడిచిపెట్టేస్తామని కూడా ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఏపీలో చంద్రబాబు అధికారంలో ఉన్నపుడూ ఫెయిల్ అయ్యారు. విపక్షంలోకి వచ్చాక కూడా ఇంకా దారుణంగా విఫలమయ్యారని వైసీపీ అంచనా వేస్తోంది. వైసీపీ పాలన సగానికి వచ్చినా కూడా ఎక్కడా ప్రజా వ్యతిరేకత లేదని వారు గుర్తుచేస్తున్నారు. ఇదే తీరున జగన్ దూకుడుగా ముందుకు సాగుతారని, వచ్చే ఎన్నికలు టీడీపీకి కీలకం కాబట్టి ఆ పార్టీని ఏపీ రాజకీయ తెర మీద నుంచి లేకుండా చేయడమే వైసీపీ టార్గెట్ అంటున్నారు.ఇక తిరుపతి ఉప ఎన్నికతో పాటు ఇటీవల జరిగిన సర్పంచ్, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం మీద తాడిపత్రి మినహా ఎక్కడా టీడీపీ గెలవలేదు. ఇదే తమ ప్రభుత్వంపై చిన్న వ్యతిరేకత కూడా లేదని చెప్పేందుకు నిదర్శనం అని అంటున్నారు. చంద్రబాబుకు చివరి ఎన్నికలను చేదు అనుభవంగా మిగిల్చి టీడీపీని శాశ్వతంగా లేకుండా చేయాలన్నదే ఇపుడు వైసీపీ వ్యూహంగా ఉందట. మరి ఏపీలో పాతిక ఎంపీ సీట్లు ఎందుకు గెలుస్తామో కూడా ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీకి పూర్తి మెజారిటీ రాదు అంటున్నారు. మోడీ పట్ల గతంలో ఉన్న మోజు జనాలలో బాగా తగ్గిందని, అందువల్ల ఈసారి ఎన్నికల్లో బీజేపీకి 200 సీట్లు వస్తే గొప్ప అంటున్నారు.అపుడు కచ్చితంగా ఏపీలోని పాతిక సీట్లు కీలకం అవుతాయని కూడా లెక్కలు వేస్తున్నారు. అలా బీజేపీకి మద్దతు ఇచ్చి ఏపీకి రావాల్సిన ప్రయోజనాలను తెచ్చుకోవడం పైనే జగన్ దృష్టి సారిస్తారు అన్నది వైసీపీ నేతల మాటగా ఉంది. ఇక ఏపీలో రాజకీయ పరిస్థితి మీద బీజేపీ కూడా అంతర్గతంగా సర్వే జరిపించుకుందని అంటున్నారు. ఏపీలో టీడీపీ పరిస్థితి క్షేత్ర స్థాయిలో దారుణంగా ఉందని అంటున్నారు.

అదే సమయంలో వైసీపీ బలంగా ఉందని బీజపీ కేంద్ర పెద్దలకు నివేదికలు అందాయట. అందుకే వారు కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ జగన్ తో సావాసం చేయాలని నిర్ణయించుకున్నారని అంటున్నారు.బాబుతో పోలిస్తే జగన్ లో ఉన్నది విశ్వసనీయత. మాట ఇస్తే వెనక్కు పోరని, మిత్రులను కాదని ముందుకు వెళ్లరని బీజేపీ నేతలు నమ్ముతున్నారు. అన్నింటికీ మించి వైసీపీ అధినేత జగన్ యాంటీ కాంగ్రెస్ అన్నదే బీజేపీకి బాగా నచ్చుతోందిట. దేశంలో కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లో రాకూడదని బీజేపీ ఎలా కోరుకుంటుందో జగన్ కూడా అలాగే కోరుకుంటున్నారుట. దాంతో తమకు సీట్లు తగ్గినా కూడా జగన్ భరోసాగా ఉంటారని బీజేపీ పెద్దలు కూడా గట్టి నమ్మకంతో ఉన్నారని చెబుతున్నారు. అందుకే ఇటీవల అనేక అంశాల్లో జగన్ పట్ల చూసీ చూడని ధోరణితో కేంద్రం ఉంటోందంటున్నారు.

## మాడగడ కుమ్మరి పిల్లలకు క్షణమే ప్రభుత్వ పాఠశాలలో సీట్లు కల్పించాలి.



విశాఖపట్నం ఆగస్టు 3, (న్యూస్ పల్స్) అరకు వేలి మండలం మాడగడ పంచాయతీ మాడ గ్రామానికి చెందిన కుమ్మరి పిల్లలు పై చదువులు చదువుకోవడానికి ప్రభుత్వ పాఠశాలల్లో లో అడ్మిషన్ లేక ప్రవేటు పాఠశాలలో విద్యని అభ్యసించడానికి ఆర్థిక స్తోమత లేక తరతరాలుగా నష్టపోతూ వీధి బాలలుగా మారుతున్నారు, ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి మాడగడ గ్రామానికి చెందిన విద్యార్థిని విద్యార్థులకు ఆరవ తరగతి లో అడ్మిషన్ ఇవ్వాలని చెప్పి తల్లిదండ్రులు పాఠశాలల్లో వెళ్లి ప్రాధేయ పడుతున్నారు అయినప్పటికీ సీట్లు దొరకక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. తల్లిదండ్రులు గిరిజన సంఘం సిపిఎం పార్టీ నాయకులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాడగడ కుమ్మరి వీధిలో తల్లిదండ్రులు విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న గిరిజన సంఘం మండల కార్యదర్శి సాంగి రామన్న,సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామా రావు తల్లిదండ్రులు విద్యార్థులతో మాట్లాడుతూ తరతరాలుగా విద్య పొందకుండా సమాజంలో వెనుకబడి ఉన్న మీకు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఉచితంగా విద్య పొందలేకపోతున్నారు విద్య వైద్యం వ్యాపారం కాకుండా వెనుకబడిన వర్గానికి ఉచితంగా విద్య అందించాలని చట్టాలు ఉన్నప్పటికీ విద్య అందని ద్రాక్షగా మారింది ఇప్పటికైనా సంబంధిత విద్యా శాఖ వారు ఈ ఏడాది ఆరవ తరగతి లో అడ్మిషన్ కొరకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంలో లో కృపా, మత్య రాజు తూమ్ నాద్, గోపి తదితరులు ఉన్నారు.

## గోదావరి ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన నూతన జాయింట్ కలెక్టర్

కుక్కునూరు,ఆగస్టు 03 పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కె ఆర్ పురం ఐటీడీఏ పీవో ఆనంద్ బాబు కుక్కునూరు మండలం లోని పోలవరం పొజెక్టు ముంపునకు గురి అవుతున్న 41.15 కంటూర్ పరిధిలో వున్నా కుక్కునూరు ం బ్లాక్ మరియు గొమ్ముగూడెం, సీతారమపురం గ్రామాలను పరిశీలన చెయ్యటానికి రావటం జరిగింది. తరవాత గోదావారి ఒడ్డును గల గొమ్ముగూడెం గ్రామానికి వెళ్లి మొన్న వచ్చిన గోదావరి ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ వున్నా గృహాలను స్వయంగా పరిశీలించారు.అనంతరం గొమ్ముగూడెం ఊరిని అనుకుని ప్రవహిస్తున్న గోదావరి ప్రవాహ ఉద్రితని పరిశీలించారు 41.15 గ్రామాల సమస్యలను తెలియ చెయ్యటానికి కుక్కునూరు మండల వైయస్సార్సీపీ అధ్యక్షులు కుచర్లపాటి నర్సింహారాజు, కుక్కునూరు పంచాయితీ గౌరవ సర్పంచ్ రావు మీనా వినోద్, మరియు వైయస్సార్సీపీ సీనియర్ నాయకులూ మాదిరాజు వెంకన్న బాబు,కృష్ణమ్ రాజు,చిన్న నర్సింహ రాజు, మల్లేలా చంటి నాయుడు పగిల్లా అల్లేశ్ బృందం కలిసి 41.15 కంటూర్ పరిధిలో వున్నా నిర్వాసితులు పడుతున్న సమస్యలను వారి దృష్టికి తెసుకువెల్తూ ఆగస్ట్ సెప్టెంబర్ లో తీవ్రమైన గోదావరి వరదల ప్రమాదం పొంచివున్న నేపథ్యంలో వారిని గోదావరి వరదలకు ముందుగానే ర్డర్ ప్యాకేజ్ పదిలక్షల చెల్లించి తాడువాయి లో నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనిలలో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయి లో కల్పించి పునరావాస కాలనిలకు తరలించాలని మరియు గతంలో ఉన్నటువంటి నిర్వాసితుల అర్హుల జాబితా నుండి వివాహం అయినది అని, ఇక్కడ ఉండటం లేదు అని మరియు చనిపోయారు అని నిజమైన అర్హులు అయిన నిర్వాసితులను పై కారణాల చేతా అసం బద్ధమైన వాట్సాప్ మేసేజులు వల్ల అన్యాయగా తొలగించారు. దీని వల్ల వాస్తవ నిర్వాసితులకు అన్యాయం జరిగింది.కాబట్టి వారి పేర్లను మొరొక్క సారీ లోతుగా పరిశీలిన చేసి అర్హుల జాబితాలోకి నమోదు చెయ్యాలి అని జాయింట్ కలెక్టర్ గారికి ఐటిడిఎ పీవో ఆనంద్ బాబుకి వినతి పత్రాలు ఇవ్వటం జరిగింది. సమస్య పై వెంటనే స్పందించిన జాయింట్ కలెక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పెండింగ్ లో ఉన్నటువంటి నిర్వాసితుల జాబితాను వెంటనే పరిశీలినా చేసి వారికీ న్యాయం చెయ్యాలి అని ఆనంద్ బాబుని ఆదేశించారు. ఈసందర్భంగా ఐటిడిఎ పీవో మాట్లాడుతూ 41.15 కంటూర్ లో వున్నా అవార్డ్ జరిగిన గ్రామాలకు బిల్లులు నమోదు చేస్తున్నాం అని గృహాల నిర్మాణం కూడా చివర దశకు చేరుకుంది అని గృహ నిర్మాణం పూర్తి అయిన వెంటనే ఆర్ అండ్ ఆర్ పరిహారం నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో జమచేసిన తరువాతే పునరావాస కాలనిలకు తరాలిస్తాం అని తెలిపారు. అదే విధంగా అన్ని ఆధారాలు వుండి అర్హుల జాబితాలో నమోదు కానీ అర్హులైన నిర్వసితులను పరిశీలన చేసి వారికీ కూడా న్యాయం చేస్తాము అని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా వారికీ నిర్వాసితులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు ఎమ్మార్వో రాజుకుమార్, కుక్కునూరు సీఐ దుర్గ ప్రసాద్, ఎస్ ఐ శ్రీనివాస్ ఆర్ఐయి, లు వి ర్ ఓ,లు, కుక్కునూరు వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కుచ్చెర్లపాటి నరసింహ రాజు,రావు వినోద్, మాదిరాజు వెంకన్నబాబు,కుచ్చెర్లపాటి చిన నరసింహ రాజు, మల్లెల చంటి నాయుడు, అల్లేష్, నిర్వాసితులు,వైఎస్సార్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి వాసులకు దారేది

విజయవాడ, ఆగస్టు 3, (న్యూస్ పల్స్)అమరావతి ఆంధ్రుల కలల రాజధాని. ఇది నన్ను చూసి, నన్ను నమ్మి అప్పగించిన బాధ్యత. అమరావతికి బాండ్స్ జారీ చేస్తే నా మీద నమ్మకంతో 2వేల రెండు వందల కోట్ల రూపాయలు ఇచ్చారు. నా అనుభవం గుర్తించే రుణాలు ఇచ్చేందుకు అంతా ముందుకు వస్తున్నారు. సింగపూర్ వంటి దేశాలతో పాటు మనదేశంలోని అన్ని రాష్ట్రాలు అమరావతి వైపే చూస్తూ ఉన్నాయంటే అది చంద్రబాబు వల్లే. ఇవన్నీ చెప్పింది ఎవరో కాదు నవ్య ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు అండ్ ఆయన టీం చేసిన విస్తృత ప్రచారం.ఐదేళ్ళు అరచేతిలో వైకుంఠం చూపడంలో తన అనుభవాన్ని అంతా రంగరించి ఒక్కటి అంటే ఒక్కటి శాశ్వత నిర్మాణం రాజధాని ప్రాంతంలో చేయకపోగా డిజైన్ల పేరుతో కాలక్షేపం చేసిన చంద్రబాబు స్వయంకృత అపరాధం అమరావతి రైతులను నిండా ముంచేసింది. ఆయన్ను నమ్మి హైదరాబాద్ లో సైతం కొందరు ఆస్తులు అమ్ముకుని విజయవాడలో పెట్టుబడులు పెట్టినవారు మట్టికొట్టుకుపోయారు. ఈ చేదు వాస్తవాలన్నీ గవర్నర్ మూడు రాజధానులు ఆమోద ముద్ర వేయడంతో చంద్రబాబు కి క్రిస్టల్ క్లియర్ గా అర్ధమైంది. దాంతో ఈ పరిణామం చంద్రబాబు ను తీవ్రంగా కలచివేసింది. కళ్ళముందే జగన్ సర్కార్ తన డ్రీం ప్రాజెక్ట్ కి మంగళం పాడేయడం జీర్ణించుకోలేకపోయారు బాబురోజులు ఎప్పుడు తాను చెప్పినట్లే ఉండవని చంద్రబాబుకు గద్దె దిగిన నాటినుంచి నెమ్మది నెమ్మదిగా తెలిసి వస్తుంది. అందుకే ఆయన గవర్నర్ ప్రకటన తరువాత భావోద్వేగానికి గురయ్యారు. నా ఆరోగ్యం సహకరిస్తే మరో పదేళ్ళు ఉంటా. నా కోసమా అమరావతి. నన్ను చూసి రైతులు ముందుకు రాలేదు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముందుకు వచ్చి భూములు ఇచ్చారు. అమరావతి నాకోసం కాదని ఏదో ఒక రోజు అంతా తెలుసుకుంటారు. ఈ రోజు చీకటి రోజు అని వ్యాఖ్యానించారు. ఇది చంద్రబాబు ఆవేదన ఆందోళన. అంతా నేనే. నా వల్లే ప్రపంచ నగరం, హైదరాబాద్ అభివృద్ధి నాదే. ఇలా గతంలో చెప్పిన చంద్రబాబు వాయిస్ పూర్తిగా మారిపోయింది.

## జమ్మలమడుగులో ఏం జరుగుతోంది...

కడప, ఆగస్టు 3, (న్యూస్ పల్స్)ఆయన నిన్న గాక మొన్న వచ్చారు. దశాబ్దాల నాటి నుంచి పాతుకుపోయిన ఆయనను ఈయన తరిమికొట్టాలనుకుంటున్నారు. అదేంకుదరదని ఆయన అడ్డంతిరుగుతున్నారు. ఇదీ స్థూలంగా జమ్మలమడుగు నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న పరిస్థితి. ప్రస్తుత ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే రామసుబ్బారెడ్డికి మధ్య రోజురోజుకూ విభేధాలు ముదురుతున్నాయి. జమ్మలమడుగులో పట్టు సంపాదించుకునేందుకు ఇరు వర్గాలు చేస్తున్న ప్రయత్నాలు పార్టీని అభానుపాలు చేస్తున్నాయి.జమ్మలమడుగులో రామసుబ్బారెడ్డి, సుధీర్ రెడ్డిల మధ్య అనేకసార్లు హైకమాండ్ పంచాయతీ చేసింది. ఇద్దరినీ సర్ది చెప్పే ప్రయత్నం చేసింది. రాజీ ఫార్ములాను కూడా సూచించింది. వచ్చే ఎన్నికలలో టిక్కెట్ తిరిగి సుధీర్ రెడ్డికే ఇస్తామని రామసుబ్బారెడ్డికి స్పష్టం చేసింది. అదే సమయంలో రామసుబ్బారెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చింది. దీంతో జమ్మలమడుగులో రెండు వర్గాలు సర్దుకుపోతాయని అంతా భావించారు.ఇటీవల నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినా రామసుబ్బారెడ్డికి ఇవ్వకపోవడంతో ఆయనకు ఎమ్మెల్సీ గ్యారంటీ అయింది. అయితే తనకు అడుగడుగునా అవమానాలు జరుగుతున్నాయని రామసుబ్బారెడ్డి వాపోతున్నారు. తనకు ఏ సమావేశంలోనూ ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇవ్వడం లేదని, తనను కలుపుకుని పోవడం లేదని ఆయన ఆరోపిస్తున్నారు. నిజానికి సుధీర్ రెడ్డికే రామసుబ్బారెడ్డి అవసరం ఉంది. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు కావాలంటే రామసుబ్బారెడ్డితో సఖ్యతగా మసలుకోవడం సుధీర్ రెడ్డికి మేలు.ఎందుకంటే హైకమాండ్ వచ్చే ఎన్నికల్లోనూ సుధీర్ రెడ్డికే టిక్కెట్ కన్ఫర్మ్ చేసింది. ప్రత్యర్థిగా ఖచ్చితంగా ఆదినారాయణరెడ్డి తలపడతారు. ఈ సమయంలో రామసుబ్బారెడ్డి ఆసరా ఉంటే సులువుగా మరోసారి విజయం సాధించవచ్చు. కానీ సుధీర్ రెడ్డి తన చర్యలతో ఆయనను దూరం చేసుకుంటున్నారు. రామసుబ్బారెడ్డి పరోక్షంగా ప్రత్యర్థులతో వచ్చే ఎన్నికల్లో చేయి కలిపితే సుధీర్ రెడ్డికి సినిమాయే కనపడుతుంది. సర్దుకుపోవాల్సిన సమయంలో సుధీర్ రెడ్డి రెచ్చిపోతుండట సరికాదన్నది పార్టీ నేతల అభిప్రాయం. మొత్తం మీద జమ్మలమడుగు వ్యవహారం మళ్లీ అడ్డం తిరిగిందనే

## వాళ్లకు గుడ్... వీళ్లకు బ్యాడ్

### మరో 6 నెలల తర్వాతే కేబినెట్ విస్తరణ

గుంటూరు, ఆగస్టు 3, (న్యూస్ పల్స్)వైసీపీ అధికారంలోకి వచ్చి రెండేళ్ళు పూర్తయింది. మరో ఆరునెలల్లో మంత్రి వర్గ మార్పు చేర్పులు ఉంటాయని ఆశావహులు ఆశగా ఎదురుచూస్తున్నారు. తన క్యాబినెట్ టీం రెండున్నరేళ్ళు మాత్రమే పదవుల్లో ఉండబోతున్నట్లు ప్రమాణ స్వీకారం నాడే జగన్ ప్రకటించారు. దాంతో మంత్రి పదవి తొలి క్యాబినెట్ లో దక్కని చాలామంది ఆశావహులు రెండున్నరేళ్ల సమయం ఎప్పుడు పూర్తి అవుతుందా అని చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నారు. ఆ సమయం ఇప్పుడు దగ్గరపడింది. ఇప్పటికే నామినేటెడ్ పదవుల పందేరాన్ని జగన్ మొదలు పెట్టేశారు. దాంతో ఇప్పుడు వైసీపీ లో ఎన్నడు లేనంత జోష్ కనిపిస్తుంది.కరోనా కారణంగా గత ఏడాదిన్నరగా మంత్రులు తమ బాధ్యతలను నిర్వర్తించింది ఏమీ లేదు. దాంతో ఎదో ఉన్నాం పోయాం అనుకోవడానికి తప్ప ఈ పదవి లో సంతృప్తి లేదని పలువురు అధిష్టానం దగ్గర ఇటీవల వ్యాఖ్యానించినట్లు తెలుస్తుంది. వారి బాధను అర్ధం చేసుకున్న అధినేత జగన్ రెండున్నరేళ్ళ పదవీకాలాన్ని మరో ఆరునెలలు పొడిగించి అప్పుడు కొత్త టీం తో ఎన్నికలకు వెళ్లాలని జగన్ యోచన చేస్తున్నట్లు వైసిపి లో చర్చ సాగుతుంది. ఇటీవల జగన్ నిర్వహించిన క్యాబినెట్ భేటీ లో సమావేశం ముగిశాకా ముఖ్యమంత్రి సూచన ప్రాయంగా ఈ మాట చెప్పినట్లు తెలుస్తుంది.151 సీట్లతో బంపర్ విక్టరీ తో అధికారంలోకి వచ్చినా అంతే స్థాయిలో మంత్రి పదవులపై పార్టీ నేతల వత్తిడి అధినేతపై ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అందరిని సంతృప్తి పరిచేందుకే జగన్ రెండున్నరేళ్లు స్కిం ప్రకటించి ఆ వత్తిడిని నాడు అధిగమించారు. ఇప్పుడు తిరిగి కాలం సమీపిస్తున్న పరిస్థితుల్లో కొత్త టీం కూర్పు కి మరికొంత సమయం తరువాత కొత్త క్యాబినెట్ కూర్పు చేయనున్నట్లు తెలుస్తుంది. అప్పటివరకు మరో ఏడాదిపాటు ప్రస్తుత మంత్రులు కరోనా గిఫ్ట్ గా తమ పదవుల్లో హ్యాపీగా ఉండొచ్చని అంటున్నారు.

# దాడి వెనుకబడిపోయారు..

విశాఖపట్టణం, ఆగస్టు 3, (న్యూస్ పల్స్)వైసీపీలో ఒక వెలుగు వెలుగుదామని వచ్చిన మాజీ మంత్రి దాడి వీరభద్రరావుకు జగన్ మరో మారు చెక్ పెట్టేసారు. ఇది 2014 కాదు మాస్టారూ అంటూ గట్టిగానే చెప్పారు. 2014 ఎన్నికల ముందు పార్టీలో దాడి, ఆయన కుమారుడు రత్నాకర్ చరితే వెంటనే విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే సీటు ఇచ్చిన జగన్ వారికి సముచిత న్యాయమే చేశారు. అయితే ఓడిపోయిన వెంటనే జగన్ మీద నానా రకాలైన విమర్శలు చేస్తూ దాడి వీరభద్రరావు బయటకు వచ్చారు. ఇక అన్ని పార్టీలు తిరిగి 2019 ఎన్నికల ముందు వైసీపీలో ఆయన చేరారు. కానీ ఎమ్మెల్యే టికెట్ దక్కలేదు. ఇపుడు చూస్తే అతి పెద్ద నామినేటెడ్ జాతరలో కూడా ఒక్క పదవిని కూడా విదల్చలేరు.ఎంచుకోవాలే కానీ మాస్టార్ ఫ్యామిలీకే అగ్రతాంబూలం అంటూ వార్తలు వచ్చాయి. విశాఖ డీసీసీబీ చైర్మన్ పదవి అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ అన్నారు. ఇపుడు ఏదీ కాకుండా చేశారని దాడి వీరభద్రరావు వర్గం మండుతోంది. నిజానికి దాడి కుమారుడికి గ్రంథాలయ చైర్మన్ పదవి ఇవ్వాలని అనుకున్నా ఆయన ఎందుకో అది వద్దనుకుని వేరే పదవి కావలాని కోరారని టాక్ అయితే ఉంది. దాంతో ఇచ్చిన పదవిని కూడా వెనక్కు లాగేసుకున్నారని చెబుతున్నారు. జగన్ దగ్గర బేరాలు అసలు కుదరవని ఈ ఎపిసోడ్ చెబుతోంది అంటున్నారు.దాడి వీరభద్రరావు పాత రోజుల్లో రాజకీయాల్లో హీరో. కానీ ప్రస్తుతం జిల్లాను శాసిస్తోంది రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి. ఆయనతో మంచి రిలేషన్స్ మెయింటెయిన్ చేయడంతో దాడి ఫ్యామిలీ వెనకబడింది అంటున్నారు. అంతే కాదు, జిల్లాలోనూ పార్టీలోనూ పొలిటికల్ గా తామే ఎక్కువ అన్న భావనతో వారు ఉండడం వల్లనే రాజకీయంగా చెడ్డారని కూడా చెబుతున్నారు. దాడి వీరభద్రరావు వరకూ చూస్తే సీనియర్ నేతగా ఉన్నారు. మరి కుమారుడు రత్నాకర్ అయినా విజయసాయిరెడ్డితో సన్నిహితంగా ఉండాల్సింది అన్న మాటా ఉంది. మొత్తానికి ఈక్వేషన్లు ఏమి పనిచేశాయెూ ఏవెూ కానీ దాడి కుటుంబాన్ని పక్కన పెట్టేశారు అంటున్నారు.నామినేటెడ్ పోస్టులు అన్నీ కూడా ఊడ్చి మరీ ఇచ్చేశారు. ఇపుడు ఇవ్వడానికి కూడా ఏమీ లేవు. అయితే దాడి ఫ్యామిలీ ఎంతో ఊహించుకుని పెద్ద పదవులను డిమాండ్ చేయడం వల్లనే హై కమాండ్ ఇవ్వలేకపోతోంది అంటున్నారు. రత్నాకర్ ని అంతకు ముందు సింహాచలం దేవస్థానం బోర్డు మెంబర్ గా నియమిస్తే ఆయన కాదన్నారు. ఇక లేటేస్ట్ గా గ్రంథాలయ చైర్మన్ పదవి వద్దన్నారు. మరి ఆయనకు కావాల్సింది ఏంటి అంటే ఇంకా పెద్ద పదవులుట. మరి ఆ పదవులు మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికే జగన్ ఇస్తున్నారు. అందుకే దాడి వీరభద్రరావు డిమాండ్లు పట్టించుకోలేదు అంటున్నారు. ఇపుడు ఎమ్మెల్సీ పదవులు ఉన్నా కూడా ఇస్తే గిస్తే మరో కీలక నేత వంశీకే తప్ప దాడి ఫ్యామిలీకి ఇచ్చేది ఉండదని ఖరాఖండీగా చెప్పేస్తున్నారు. మరో మూడేళ్ల పాటు ఇలాగే దాడి ఫ్యామిలీ గడపాల్సి ఉంటుంది మరి. ఎమ్మెల్యే ఎన్నికల్లో కూడా టికెట్ రాకపోతే టీడీపీలోకి తిరిగి జంప్ చేయాల్సిందే అంటున్నారు.

# ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగస్తులకు పీఆర్సీ వర్తింప చేయాలి

ఖానాపూర్ ఆగస్టు 03 జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో) సౌజన్యంతో తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్నఏఆర్ టీ ,ఐసీటీసీ ,పీపీటీసీటీ ,డీఎస్ఆర్ సీ ,ఎస్ఆర్ఎల్ ,డీఏసీపీయూ, బ్లడ్ బ్యాంక్ లలో వివిధ క్యాడర్లో ఒప్పంద కార్మికులుగాపనిచేస్తున్న సుమారు 900 మంది ఉద్యోగులకుకేంద్ర,ప్రభుత్వం 2014 సంవత్సరాల నుంచిపీఆర్సీ వర్తింపచేయలేదని దానికి నిరసనగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ పిలుపు మేరకుతెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనలో భాగంగా రెండో రోజు కూడా ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగులు తమ , తమ రోజు వారి విధులు నిర్వహిస్తూ, నల్ల బ్యాడ్జీలతో పీఆర్సీ వర్తింపచేయాలని నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగుల జేఏసీ నాయకుడు ఎండి .సాజీద్ అలీ మాట్లాడుతూజాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో),కేంద్ర ప్రభుత్వంతమతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ వైద్యులకు పీఆర్సీ వర్తింపచేసి మిగతా ఉద్యోగులకు వర్తింపచేయక మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కోవిడ్ నియంత్రణకు వివిధసెంట్రల్ స్కీమ్ క్రింద పనిచేస్తున్నఆయాష్ ,తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ,నేషనల్ ట్యూబర్ క్యులోసిస్ ఎలిమినేటర్ ప్రోగ్రాం, సిబ్బందితో సేవలను వినియోగించుకుని ,తీరా రాష్ట్ర పీఆర్సీలో మొండి చేయి చూపిందని ,కోవిడ్ నియంత్రణలో విధులు నిర్వహిస్తూ కొందరు కొవిడ్ బారిన పడి ఆసుపత్రికి పడ్డారని,మరి కొందరు ఉద్యోగులు కొవిడ్ తో మరణించారని అయిన ప్రభుత్వం గుర్తించ లేదని ఆవేదన వ్యక్తంచేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖ పని చేస్తున్న కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర పీఆర్సీ వర్తింపజేసిందని , వైద్య శాఖలో సెంట్రల్ స్కీం లో పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ,తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ,నేషనల్ ట్యూబర్ క్యులోసిస్ ఎలిమినేటర్ ప్రోగ్రాం,ఆయాష్ పోగ్రామ్ లలో పని చేస్తున్న ఉద్యోగులకు మాత్రం పీఆర్సీ వర్తింప చేయలేదని,కొవిడ్ నియంత్రణ కు వారు చేసిన సేవలను గుర్తించి వెంటనే పీఆర్సీ వర్తింప చేయాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు.నిరసనలో భాగంగా ప్రతి జిల్లా కలెక్టర్ ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ,ఆసుపత్రి సూపరింటెండెంట్ లకు వినతిపత్రం సమర్పిస్తామని ఆయన తెలిపారు.అలాగే జూలై నెల రిపోర్టులతోపాటు లైన్ లిస్టు ,సిమ్స్ ,పాల్స్ , సోచ్ లు అపినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయాష్ వైద్యాధికారి డాక్టర్. సాలేహా బేగం , ఫార్మసిస్ట్ శైలజ ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ సాజీద్ అలీ,శైలజ , కౌన్సిలర్ రామ్ చందర్,ఏడీబీ ప్లస్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ వంశీకి ఈ సారైనా...

విశాఖపట్టణం, ఆగస్టు 3, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లాలో దాదాపుగా అందరికీ పదవులు దక్కాయి. ఒకవేళ ఎవరూ లేరనుకున్నా కూడా గుర్తు పెట్టుకుని మరీ అటు జగన్ ఇటు విజయసాయిరెడ్డి వారికి పదవులు ఇచ్చారు. ఒక విధంగా చెప్పాలంటే పన్నెండేళ్ల నుంచి పార్టీని పట్టుకుని సాగుతున్న వారందరికీ జగన్ బాగానే న్యాయం చేశారు అన్న మాట అయితే పార్టీలో సర్వత్రా వినిపిస్తోంది. అయితే అందరి చూపూ ఒకే ఒకరి మీద ఉంది. ఆయనే విశాఖ సిటీ వైసీపీ ప్రెసిడెంట్ వంశీకృష్ణ శ్రీనివాస్. ఆయన మరోమారు అన్యాయం అయిపోయారా అన్న టాక్ అయితే ఉంది.విశాఖ వైసీపీ అంటే జగన్ కి మొదట గుర్తుకు రావాల్సింది వంశీకృష్ణ శ్రీనివాస్ పేరే. ఎందుకంటే వైసీపీని ఏర్పాటు చేశాక ఈ జిల్లా నుంచి మొదట చేరింది ఆయనే. అంతే కాదు, జగన్ అప్పట్లో ఓదార్పు యాత్రకు విశాఖ వస్తే జగన్ ఆయన ఇంటికే వెళ్ళి బస చేశారు. అంతలా జగన్ తో మంచి రిలేషన్ ఉన్న వంశీకృష్ణ శ్రీనివాస్ కి పదవులు మాత్రం అందని పండే అవుతున్నాయి. మరీ ముఖ్యంగా చూసుకుంటే 2019 నుంచి ఆయనకు ఎదురుదెబ్బలే తగులుతున్నాయి. 2019 ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యే సీటు ఆయనకు వచ్చినట్లే వచ్చి జారిపోయింది. నాడు విశాఖ మేయర్ పదవి ఇస్తామని చెప్పి పక్కన పెట్టారు ఇక ఆరు నెలల క్రితం జరిగిన మేయర్ ఎన్నికల్లో కూడా వంశీకృష్ణ శ్రీనివాస్ ని అనూహ్యంగా తప్పించేశారు.విశాఖ మేయర్ కి సరిసాటిగా మరో పదవి ఉంది. అదే వీఎమ్మార్డీయే పోస్ట్. ఈ కీలకమైన పదవిని తూర్పు వైసీపీ ఇంచార్జి అక్రమాని విజయనిర్మలకు ఇచ్చి వంశీకృష్ణ శ్రీనివాస్ కి మళ్ళీ హ్యాండ్ ఇచ్చారు. వంశీకి రాష్ట్ర స్థాయిలో కీలకమైన నామినేటెడ్ పదవిని ఇస్తామని ఆ మధ్య విజయసాయిరెడ్డి కూడా చెప్పుకొచ్చారు. వంశీకృష్ణ శ్రీనివాస్ కూడా జగన్ ని స్వయంగా కలసి తన బాధ చెప్పుకున్నారు. ఇంత జరిగిన తరువాత కూడా వంశీకి మళ్లీ మొండి చేయ్యే చూపించారని ఆయన అనుచరులు మండిపోతున్నారు. తమ నేత కరివేపాకు అయ్యారా అని కూడా ఆగ్రహిస్తున్నారు. పార్టీలో వెనక వచ్చిన వారికే పదవులా అంటూ విమర్శిస్తున్నారు.ఏపీలో తొందరలో 13 దాకా ఎమ్మెల్సీ పదవులు భర్తీ చేస్తారు అంటున్నారు. స్థానిక సంస్థల కోటాలో ఎనిమిది, ఎమ్మెల్యే కోటాలో అయిదు ఎమ్మెలీ పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ పదవులు అన్నీ కూడా వైసీపీకే దక్కుతాయి. ఇక మిగిలినవి కూడా ఇప్పట్లో ఇవే అంటున్నారు. వంశీకృష్ణ శ్రీనివాస్ కి ఇవ్వాలి అనుకుంటే ఈ పదవులే ఉన్నాయని అంటున్నారు. అయితే ఈ పదవుల విషయంలో కూడా పెద్ద ఎత్తున పోటీ ఉంది. కానీ విశాఖ జిల్లాకు ఈసారి తప్పకుండా ఒక పదవి ఖాయమని అంటున్నారు. దాన్ని వంశీకి ఇస్తారని చెప్పి ప్రస్తుతానికి అనునయిస్తున్నారు. మరి జగన్ రాజకీయ లెక్కలు ఏమైనా మారితే వంశీకృష్ణ శ్రీనివాస్ కి ఈ పదవి దక్కేనా అన్న భయాలు అనుమానాలు అయితే అనుచరులలో ఉన్నాయట. మొత్తానికి వంశీకి పదవి ఇస్తేనే వైసీపీ క్యాడర్ కి జగన్ పూర్తి న్యాయం చేసినట్లు అవుతుందన్నది పార్టీలో కూడా గట్టిగా వినిపిస్తున్న మాట.

# మహిళ దొంగల ముఠా అరెస్ట్

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లాలో బంగారం షాపుల్లో నకిలీ బంగారాన్ని పెట్టి అసలు బంగారాన్ని దొంగతనం చేసే మహిళా దొంగలను రాజాం పోలీసులు పట్టుకున్నారు. గతనెల 27న రాజాంలో రెండు జూలరీ షాప్ల సాయి కిరణ్ జ్యులరీ వేగుచుక్క జ్యులరీ షాపులో రోల్డ్ గోల్డ్ వస్తువుపెట్టి వర్జినల్ అసలు బంగార వస్తువులను దొంగతనం చేస్తున్న 5గురు మహిళా గ్యాంగ్ ముఠా. వీరు మళ్ళీ 29న రాజాంలో చోరీకి ప్రయత్నించగా అక్కడున్న జ్యులరీ షాప్ యజమాని వారిని గమనించి పోలీసులు ఫిర్యాదు చేయగా ఆ ముఠా తప్పించుకునే ప్రయత్నం చేశారు వాళ్లను వెంబడించి పోలీసులు పట్టుకున్నారు.

# కిల్లికి గుడ్ న్యూస్



విజయనగరం, ఆగస్టు 3, (న్యూస్ పల్స్)నామినేటెడ్ పదవులు అందరికీ దక్కాయి. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయిన వారందరికీ ఏదో ఒక కార్పొరేషన్ ను జగన్ అప్పగించారు. అయితే ఇప్పుడు పదవులు దక్కని కొందరు పెద్ద ఆశలే పెట్టుకున్నారు. తమకు ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవులు ఇస్తారన్న ఆశతో ఉన్నారు. వారిలో కిల్లి కృపారాణి ఒకరు. ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పోస్టులలో అందరికీ పదవులు దక్కాయి. కానీ కిల్లి కృపారాణిని జగన్ ఈ లిస్ట్ నుంచి మినహాయించారు.కిల్లి కృపారాణి గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. పార్టీ విజయం కోసం కష్టపడ్డారు. కానీ టెక్కలి నియోజకవర్గంలో పార్టీ ఓటమి పాలయింది. పార్లమెంటు స్థానం కూడా వైసీపీ కోల్పోవాల్సి వచ్చింది. కింజారపు కుటుంబాన్ని ఢీకొట్టేందుకే కిల్లి కృపారాణిని జగన్ పార్టీలోకి తీసుకున్నారు. కానీ అది మాత్రం నెరవేరలేదు. అయితే పార్టీలో చేరేటప్పుడే జగన్ కిల్లి కృపారాణికి హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు.అధికారంలోకి వస్తే ఆశించిన పదవి దక్కుతుందని జగన్ కిల్లి కృపారాణికి మాట ఇచ్చారంటారు. గత రెండేళ్లుగా కిల్లి కృపారాణి పదవి కోసం ఎదురు చూస్తున్నారు. కిల్లి కృపారాణికి రాజ్యసభకు వెళ్లాలన్న కోరిక ఉంది. ఆమె పార్లమెంటు సభ్యురాలిగా చేయడంతో ఢిల్లీ రాజకీయాలపైనే ఆమె ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. అయితే ఇప్పటి వరకూ భర్తీ అయిన రాజ్యసభ స్థానాలను వివిధ కారణాలతో జగన్ ఇతరులకు కేటాయించాల్సి వచ్చింది.అయితే ఈసారి ఎమ్మెల్సీ, రాజ్యసభ ఏదో ఒక స్థానానికి జగన్ కిల్లి కృపారాణిని ఎంపిక చేస్తారని తెలుస్తోంది. గతంలో టెక్కలి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన దువ్వాడ శ్రీనివాస్ ను ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. దీంతో రాజ్యసభ స్థానానికే కిల్లి కృపారాణిని జగన్ ఎంపిక చేసే అవకాశాలున్నాయని చెబుతున్నారు. మొత్తం మీద కిల్లి కృపారాణి కోరిక నెరవేరడానికి పెద్దగా సమయం అవసరం లేదు. త్వరలోనే ఆమె చట్ట సభల్లో చూడవచ్చున్నది పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం.

# మండల్, మునిసిపల్ టాస్క్ ఫోర్స్ ప్రతి రోజు కోవిడ్ నియంత్రణ పై సమీక్ష చేసుకోవాలి

తిరుపతి, ఆగస్టు 03 జిల్లా లో పాజిటివిటీ రేట్ 21 మండలాల్లో పెరుగుతున్న దృష్ట్యా మండల మునిసిపల్ టాస్క్ ఫోర్స్ ప్రతి రోజు గంట పాటు సమయం కేటాయించి సమీక్షించి కోవిడ్ 19 నియంత్రణపై చర్యలు చేపట్టాలని రికవరీ రేటుకన్నా పాజిటివిటీ రేటు పెరుగుతున్నదని ఇవి ప్రమాద హెచ్చరికలుగా గుర్తించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం ఉదయం స్థానిక ఆర్ డి ఓ కార్యాలయం నుండి మండల, మునిసిపల్ టాస్క్ ఫోర్స్ , మెడికల్ ఆఫీసర్ల తో వారపు వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా జే సి హెల్త్ వీర బ్రహ్మం తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ స్పెషల్ ఆఫీసర్లు , మండల, మునిసిపల్ టాస్క్ ఫోర్స్ కోవిడ్ నియంత్రణ కోసం టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీట్మెంట్, వాక్సినేషన్ పై అప్రమత్తం అవసరమని, సీరియస్ గా పని చేయాలని ఆదేశించారు. గత వారం జిల్లా పాజిటివిటీ రేటు 2.48 నుండి 2.76 కు చేరిందని 2400 నుండి 3100 గా యాక్టివిటీ కేసులు జిల్లాలో వున్నాయని అసలసత్వం వీడి అప్రమత్తంగా వుండాలని అన్నారు. ఇది కోవిడ్ కేసులు పెరగడానికి సంకేతాలు అని గుర్తించాలని అన్నారు. పాజిటివిటీ కేసులు నమోదు అయిన వారి మొదటి , రెండవ కాంటాక్ట్ ట్రేసింగ్ చేసి వారిని హోమ్ ఇసోలేషన్ లో వుంచి పరీక్షలు చేయాలని, వారిని ఎట్టి పరిస్థితులలో బయట తిరగకుండా చూడాలని అన్నారు. సోషల్, రిలిజియస్ కార్యక్రమాలలో భౌతిక దూరం, మాస్కులు ధరించేలా, గుంపులుగా లేకుండా చూడాలని వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రేణిగుంట, తవణంపల్లి , సదుం, చిత్తూరు అర్బన్, తిరుపతి అర్బన్, నగరి, చిన్న పాండూరు, గంగవరం, బైరెడ్డి పల్లి ప్రాంతాలలో కంటైన్మెంట్ జోన్ లలో కోవిడ్ నిబంధనలు పూర్తి స్థాయి లో అమలు కావాలని, అప్పుడే కేసులు తగ్గే అవకాశం ఉంటుందని సూచించారు. లక్షణాలు వున్న వాళ్లకి , ప్రైమరీ సెకండరీ కాంటాక్ట్స్

**సోషల్, రిలిజియస్ ఫంక్షన్లలో కోవిడ్ నామ్స్ తప్పనిసరి**
**కంటైన్మెంట్ జోన్ లలో జి ఓ 371 అమలు కావాలి**
**జిల్లా కలెక్టర్**

వారికి పరీక్షలు చేస్తే పాజిటివిటీ వచ్చిన వ్యక్తులను కోవిడ్ కేర్, లేదా ఆసుపత్రులకు తరలించాలని, అందుకే అన్ని కోవిడ్ సెంటర్లు , ఆసుపత్రులను కోవిడ్ కోసం అందుబాటులో ఉన్నాయనేది గుర్తించాలని తెలిపారు. జి. ఓ. 371 అమలు ఖచ్చితం గా జరగాలని అపరాధ రుసుము , షాప్స్ టైమింగ్ , కాంటాక్ట్ ట్రేసింగ్ వంద శాతం అమలు కావాలని ఆదేశించారు. టెస్టింగ్ విషయంలో ఏ రోజు కా రోజు రిజల్ట్ రావాలని, హోమ్ ఇసోలేషన్ వారిని ప్రతి రోజు పరిస్థితి సమీక్షించాలని సూచించారు. చిన్న పిల్లల తల్లులు, టీచర్లు, 45 సంవత్సరములు పై బడ్డ వారికి రెండవ డోస్ వాక్సినేషన్ పై దృష్టి పెట్టాలని 90 % కు తీసుకురావాలని ఆవిధం గా ప్రణాళిక మీ వద్ద వుంచుకొని అమలు చేయాలని అన్నారు. సచివాలయాలు: సచివాలయాలలో హాజరు నమోదు 100%, అక్కడ అందించే సర్వీసులు పెన్షన్స్, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు, ఆరోగ్యశ్రీ కార్డులకు ప్రాధాన్యత నిచ్చి నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని తెలిపారు. మండల అభివృద్ధి అధికారులు నరేగా లేబర్ కాంపోనెంట్ పై దృష్టి పెట్టి పనిదినాలు కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫెరెన్స్ లో జే సి హెల్త్ వీర బ్రహ్మం , కలెక్టర్ గారితో పాటు సమీక్ష జరపగా, డి ఎం హెచ్ ఓ శ్రీహరి, తిరుపతి నగర పాలక సంస్థ మెడికల్ ఆఫీసర్ హరికృష్ణ , డిప్యుటీ డి ఎం హెచ్ ఓ లు అరుణ సులోచన, ఆర్ ఆర్ రెడ్డి, కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ తిరుపతి నుండి పాల్గొన్నారు.

# బైక్ దొంగల ముఠా అరెస్టు

చిత్తూరు ఆగస్టు 3, (న్యూస్ పల్స్)మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లా అయిన చిత్తూరులో టూ వీలర్ బైక్ ముఠాను పోలీసులు ఆరెస్టు చేసారుఏ. సుమారు రూ. 1 కోటి విలువైన 107 ద్విచక్ర వాహనాలు, 1 ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ లలో నమోదు అయిన ద్విచక్ర వాహనాల దొంగతనాలను చేధించడానికి ఎస్. పి. ఎస్. సెంథిల్ కుమార్. చిత్తూరు జిల్లా లోని నాలుగు సబ్ డివిజన్ అధికారుల నేతృత్వంలోని ఓ బృందాన్ని ఏర్పాటు చేసారు. ఈ బృందం దర్యాప్తు లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నమోదు అయిన ద్విచక్ర వాహనాల దొంగతనాలను చేధించింది. వాహనాలను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అమ్మే 11 మంది దొంగలను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుండి 107 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకున్నారు. వీరంతా ద్విచక్ర వాహనాలను ఇంటి అరు బయట పార్కింగ్ చేసి ఉన్నప్పుడు, షాపింగ్ మాల్స్ వద్ద, దుఖానాల వద్ద పార్క్ చేసి ఉన్న వాహనాలను దొంగిలించి, ఆ వాహనాలను తక్కువ ధరకు అమ్మేవారు. వీరు చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బులు సంపాదించాలని కోరికతో ద్విచక్ర వాహనాల దొంగతనం చేసేవారని సెంథిల్ కుమార్ చెప్పారు.

# అమర్ రాజా కార్మికుల అందోళన

రేణిగుంట ఆగస్టు 3, (న్యూస్ పల్స్)అమర్ రాజా బ్యాటరీ రాష్ట్రం నుంచి తమిళనాడుకు తరలి వెళ్తుంది అన్న వార్తలతో ఒక్కసారిగా అమర రాజా బ్యాటరీ కార్మికుల లో ఆందోళన నెలకొంది. కరోనా కష్టకాలంలో కోడా ప్రతి నెల ఒకటో తేదీ జీతాలు అందించే కంపెనీ ఇక ఉండదు అన్న వార్తలు తో ఉద్యోగస్తులు కార్మికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట మండలం కరకంబాడి వద్ద ఉన్న అమర రాజా ఫ్యాక్టరీ ముందు ఏ ఐ టి యు సి కార్మిక సంఘం, తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంటు తెలుగుదేశం ఇంచార్జ్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తోనే అమర రాజా ఫ్యాక్టరీ పక్క రాష్ట్రానికి తరలి వెళ్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రం లో కొత్త కంపెనీలు తీసుకురావటం పోయి ఉన్న కంపెనీలను కూడా మూసి వేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించటం తగదని హితవు పలికారు. కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ 40 వేల మందికి ఉపాధి కల్పిస్తున్న అమర రాజా ఫ్యాక్టరీ తమిళనాడు తరలి వెళ్తున్న వార్తలు చాలా బాధ కలిగిస్తున్నాయని అన్నారు. దేశంలోనే బ్యాటరీ రంగంలో రెండవ స్థానంలో ఉన్న కంపెనీ పై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తీసుకోవటం వలన ఎందరో పేద ప్రజల జీవితాలు రోడ్డు పాలు అవుతున్నాయని ఆవేదన చెందారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరచి కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపి కంపెనీని ఇక్కడే ఉండేటట్లు చూడాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనకు కార్మిక సంఘాలు ప్రతిపక్ష పార్టీ నాయకులు సిద్ధమని హెచ్చరించారు.

# ఆంధ్రా కాంగ్రెస్ పై ఏఐసీసీ దృష్టి

విజయవాడ, ఆగస్టు 3, (న్యూస్ పల్స్)ఏపీ కాంగ్రెస్ వ్యవహారాలపై రాహుల్ కీలక మంతనాలు చేస్తున్నారు. త్వరలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు రాహుల్ గాంధీ. ఆగస్టు 10వ తేదీన ఢిల్లీకి రావాలని కొంతమంది సీనియర్ నేతలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పిలుపు ఇచ్చింది. ఏపీలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి పై చర్చించనున్నారు రాహుల్. ఏపీ రాష్ట్రానికి చెందిన కొద్దిమంది సీనియర్ నాయకులతో విడివిడిగా, ముఖాముఖి సమాలోచనలు జరపనున్నారు రాహుల్ గాంధీ. కాంగ్రెస్ పార్టీని ఏపిలో బలోపేతం చేసేందుకు రాష్ట్ర నేతల ఆలోచనలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకోనున్నారు.ఇక రాష్ట్ర నేతల అభిమతం తెలుసుకున్న తర్వాత కీలక నిర్ణయాలు తీసుకోనున్న రాహుల్ గాంధీ. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు డా. చింతా మోహన్, మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, పిసిసి మాజీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి జే.డి. శీలం, మాజీ ఎమ్.పి డా. కే. వి. పి. రామచంద్ర రావు, ఏఐసిసి సెక్రటరీ గిడుగు రుద్రరాజు లను ఢిల్లీ కి రావాలని కోరింది కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం. ఏపి కి కొత్త పిసిసి అధ్యక్షుడు నియామకం తో సహా, కొంతమంది ఏపి నేతలకు జాతీయ స్థాయి లో బాధ్యతలు అప్పగించాలనే యోచనలో రాహుల్ గాంధీ ఉన్నారు.ఇటీవలే, ఏఐసిసి సంస్థాగత వ్యవహారాల ఇంచార్జ్ జనరల్ సెక్రటరీ కే.సి. వేణుగోపాల్ తో సమావేశమై, విపులంగా చర్చించిన ఏపి ఇంచార్జ్ ఉమన్ చాండి, ఇంచార్జ్ ఏఐసిసి సెక్రటరీలు క్రిస్టోఫర్, మయప్పన్? ఆ తర్వాత రాహుల్ గాంధీతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించి, నివేదికను కూడా అందజేసారు కే.సి. వేణుగోపాల్, ఏపి కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ ఏఐసిసి జనరల్ సెక్రటరీ ఉమన్ చాండీ, ఇంచార్జ్ ఏఐసిసి సెక్రటరీలు క్రిస్టోఫర్, మయప్పన్?. ఏపిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కొన్ని సూచనలతో కూడిన కార్యాచరణ ను రాహుల్ గాంధీ కి అందజేసారు ఇంచార్జ్ జనరల్ సెక్రటరీ ఉమన్ చాండి. అవసరాన్ని బట్టి మరికొంతమంది ఏపి రాష్ట్ర నేతలను కూడా రాహుల్ గాంధీ విడిగా కలిసే అవకాశం ఉంది.

# కమలం వలస నేతలకు గుర్తింపు

హైదరాబాద్, ఆగస్టు 3, (న్యూస్ పల్స్)ఎదుటి వారిని నమ్మించడానికి 'ఒట్టేసి' చెబుతారు కొందరు. మరికొన్నిచోట్ల ఇష్టదైవాలపై ప్రమాణాలు చేయిస్తారు. ఒట్లు.. ప్రమాణాలు లేకపోయినా.. ఇటీవల కాలంలో ఆ జాతీయ పార్టీ నాయకుల ఢిల్లీ ప్రయాణం ఇంచుమించు అలాగే ఉందట. పైగా కీలక నేతలు ఎస్కార్ట్‌గా వెళ్లడం ఆసక్తి కలిగిస్తోంది. తెలంగాణ బీజేపీలో రెండేళ్లుగా వివిధ పార్టీల నుంచి మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు పెద్దసంఖ్యలో చేరారు. ఇటీవల ఆ చేరికలు నెమ్మదించాయి. కానీ.. వలస వచ్చిన నేతలు.. గుడ్‌బై చెబుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు మాజీ మంత్రులు.. ఒక మాజీ ఎమ్మెల్యే బీజేపీకి రాంరాం చెప్పారు. ఇలా ఒక్కొక్కరుగా కాషాయ శిబిరం నుంచి చేజారిపోతుండటంతో కమలనాథులు అలర్ట్ అయ్యారు. బీజేపీ నుంచి వెళ్లేవారివల్ల పార్టీకి నష్టమా.. లాభమా అనేది పక్కన పెడితే.. జరుగుతున్న పరిణామాలు రాంగ్ సిగ్నల్ పంపుతాయని నాయకులు కలవరం చెందారట. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు ఈ అంశంపై ఫోకస్ పెట్టినట్టు సమాచారం. ఆ తర్వాత పరిస్థితిని చక్కదిద్దేందుకు రాష్ట్ర బీజేపీ నేతలు తీసుకున్న చర్యలే ఇప్పుడు చర్చకు దారితీస్తున్నాయి.బీజేపీలోని వలస నాయకులపై టీఆర్ఎస్, కాంగ్రెస్ గురిపెట్టాయి. కొన్ని పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. వారు వెళ్తారో లేదో కానీ.. బండి సంజయ్ అంట్ టీమ్ గత రెండేళ్లుగా పార్టీలో చేరిన వారితో మాట్లాడటం మొదలుపెట్టింది. ముఖ్యంగా యువనేత వీరేంద్రగౌడ్ ఇంటికి రేవంత్, మధుయాష్కీలు వెళ్లి మాట్లాడిన తర్వాత.. బీజేపీలో పరిస్థితిని చక్కదిద్దేందుకు వేగంగా పావులు కదిపినట్టు తెలుస్తోంది. రేవంత్‌తో భేటీ తర్వాత వీరేంద్రగౌడ్.. నేరుగా ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలిసివచ్చారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్‌లతో ప్రత్యేకంగా మాట్లాడారు కూడా. ఆ విధంగా తాను పార్టీ మారడం లేదన్న సంకేతాలు పంపించారు వీరేంద్రగౌడ్ఎవరిపేర్లు అయితే సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నాయో.. వారిని తీసుకుని బీజేపీ నేతలు ఢిల్లీ వెళ్లడం మొదలుపెట్టారు. పెద్దిరెడ్డితోపాటు పార్టీని వీడతారని అనుకున్న మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి..మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లను వెంటబెట్టుకుని ఢిల్లీ వెళ్లారు

# జెన్టీయూ కాకినాడలో కరోనా కలకలం

కాకినాడ ఆగస్టు 3, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లా కాకినాడ లోని జెఎన్ టియు కాకినాడలో కరోనా కలకలం రేపింది. కాలేజ్ క్యాంపస్ లోని గర్ల్స్ హాస్టల్ లో 15 మంది విద్యార్థినులకు కరోనా పాజిటివ్ గా నిర్ధారణ కావడంతో యూనివర్సిటీ అధికారులు హాస్టల్ లో అందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. సుమారు 400 మంది విద్యార్థినులలో అలజడి మొదలు కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది

# బూడిద కడుపులోకి వెళ్లి రక్తం పడుతుంది...

**కళ్ళు కనపడక ప్రమాదాల బారిన పడుతున్నాం...!!**
**అమాయకుల ప్రాణాలు పోతుంటే పట్టించుకోరా..??**
**కొండపల్లి ఖిల్లా రోడ్డు నివాసాల నడుమ బూడిద రవాణా పై స్థానికుల ఆగ్రహం...!!**
**ఖిల్లా రోడ్డు దిగ్బంధం చేసి ఆందోళనకు దిగిన స్థానికులు...**

విజయవాడ ఆగస్టు 3, (న్యూస్ పల్స్)గత కొన్నేళ్లుగా బూడిద లో నరకయాతన అనుభవిస్తున్నాం.. మా సమస్య పట్టించుకోరా...?? తక్షణమే మా సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇబ్రహీంపట్నం ఖిల్లా రోడ్డు ను స్థానికులు దిగ్బంధించారు.. జిల్లా అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. నోటి నుండి రక్తం పడుతుంటే కనీసం పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు... తక్షణమే ఖిల్లా రోడ్డు పై బూడిద లారీలు రవాణా నిలిపివేయాలని స్థానికులు స్వయంగా నిరసనకు దిగారు..

## టిప్పు సుల్తాన్ విగ్రహానికి నో

కడప, ఆగస్టు 3, (( విభారె) వైసీపీ నేత, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి కడప జిల్లా కలెక్టర్ షాక్ ఇచ్చారు. ప్రొద్దుటూరులో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటుకు కలెక్టర్ అనుమతి నికారించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పబ్లిక్ ప్లేసుల్లో విగ్రహాల ఏర్పాటుకు అనుమతి నిరాకరిస్తున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా, ప్రొద్దుటూరులో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు కోసం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి భూమి పూజ చేశారు. అయితే, ఈ నిర్ణయంపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేయొద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు విగ్రహం ఏర్పాటు కోసం శంఖుస్థాపన చేసిన చోట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు ధర్నా నిర్వహించారు. ఈ వివాదాల నేపథ్యంలో విగ్రహం ఏర్పాటుకు అనుమతి నిరాకరిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.కాగా, కలెక్టర్ ఉత్తర్వులపై బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి స్పందించారు. విగ్రహం ఏర్పాటును నిరాకరిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. ప్రొద్దుటూరులో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకున్న ఎమ్మెల్యే రాచమల్లు కుట్రలు భగ్నం అయ్యాయని అన్నారు. బీజేపీ చేసిన పోరాటాల ఫలితంగానే అక్కడ ఎటువంటి విగ్రహాన్ని ఏర్పాటు చేయొద్దంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఇది హిందువులు, బీజేపీ కార్యకర్తల విజయం అన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రొద్దుటూరు ప్రజలు సాధించిన గొప్ప విజయంగా ఆయన అభివర్ణించారు. దేశంలో నివసించే ఎవరైనా సరే భారత రాజ్యాంగాన్ని పాటించాలన్నారు. కాదని రాచమల్లు రాజ్యంగం పాటిస్తామంటే.. ఇలాంటి ఎదురు దెబ్బలే తగులుతాయని ఎద్దేవా చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎమ్మెల్యే మీద, ఇతరుల మీద పోలీసులు కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## స్పందన కార్యక్రమానికి అందిన అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించిన నంద్యాల సబ్ కలెక్టర్

నంద్యాల ఆగస్టు 3 ( విభారె) స్పందన కార్యక్రమానికి అందిన అర్జీని క్షేత్రస్థాయిలో నంద్యాల సబ్ కలెక్టర్ చహత్ బాజ్ పాయ్ పరిశీలించారు. మంగళవారం నంద్యాల మండలం మిట్నాల గ్రామం లో ని పంట పొలాల లోనికి నీరు వస్తుందని స్పందనలో పెట్టుకున్న అర్జీకి సంబందిచి క్షేత్ర స్థాయిలో నంద్యాల సబ్ కలెక్టర్ చహత్ బాజ్ పాయ్. నంద్యాల తహసీల్దార్ రవికుమార్. రహదారులు మరియు భవనాల శాఖ ఈఈ సురేష్ బాబు లతో కలిసి పరిశీలించారు. అనంతరం నంద్యాల సబ్ కలెక్టర్ చహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ నంద్యాల నుండి బనగానపల్లె కు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు మిట్నాల గ్రామ సమీపంలో 14వ మైలు రాయి దగ్గర నుండి రోడ్ కు ఇరుప్రక్కల ఉన్న పంట కాల్వలను కొంతమంది రైతులు పూడ్చిపెట్టినారని దీని కారణంగా వర్షపునీరు పంటపొలాల లోకి వచ్చి భూములు ముంపునకు గురై తున్నాయని ఆ గ్రామ రైతులు పెట్టుకున్న దరఖాస్తు ను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది అన్నారు.

## ప్రజలపై పెను భారం మోపుతున్న చెత్తపన్నులు, ఆస్తిపన్నులు,నీటి పన్నులు రద్దు చేయాలని ఇంటింటి ప్రచారం:సీపీఐ



ఎమ్మిగనూరు ఆగస్టు 3 ( విభారె) రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పన్నుల రూపంలో అధిక భారం మోపుతూ ఆస్తిపన్ను,చెత్త పన్ను, నీటిపన్నులకు సంబంధించిన జీవో నెంబర్ 196,197,198 రద్దు చేయాలని కోరుతూ సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో లక్ష్మీ పేట లోని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని సీపీఐ పట్టణ కార్యదర్శి కే. తిమ్మగురుడు,ఏఐటియుసి తాలూకా కార్యదర్శి బాలరాజు, రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు కె.సి జబ్బర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాలు అభివృద్ధి పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ దేశ్ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వేల కోట్ల రుణాలు ఆశపడి ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి ఆస్తిపన్ను చట్టాలను సాధించిందని ఇది స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టికి స్థానిక సంస్థల మనుగడకు విరుద్ధమైన చర్య అని ఇది 93 94 వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధమని వారు తెలిపారుజీవో నెంబర్ 96 97 ల ప్రకారం ప్రతి సంవత్సరం మంచి నీరు డ్రైనేజీ ఛార్జీలు పెంచుకునే అవకాశం కలిగింది నెలకు 100 నుండి 350 రూపాయల వరకు వసూలు చేసే అధికారం నీటి మీటర్లు పెట్టడానికి రంగం సిద్ధం చేస్తున్నారు ఎన్ని మరుగుదొడ్లు ఉంటాయో నెలకు 40 రూపాయల వరకు డ్రైనేజి చార్జీలు వసూలు చేస్తారు చెత్త పనులు కూడా దుర్మార్గమైన విషయం చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టి తో సహా అనేక రకాల పన్నులు వసూలు చేస్తున్నారు న్యాయబద్ధంగా చట్టబద్ధంగా ఆర్థిక సంఘాల ద్వారా స్థానిక సంస్థలకు మంజూరు అయిన రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్నాయి కేంద్రం నుండి మంజూరైన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వరకు స్థానిక సంస్థలకు కేటాయించాలి. ఇది జరుగుతుందా అనే సందేహం కలుగుతుంది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి స్థానిక కౌన్సిళు సమీక్షించి పన్నులు పెంచాలా వద్ద అనే స్థానిక కౌన్సిళ్లు నిర్ణయాధికారాన్ని కి పాలకులు తిలోదకాలు ఇస్తున్నారని వారు తెలిపారు. కార్పొరేట్లకు పెద్దపీట వేసే మోడీ నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వం తల ఊపుతుంది మరి కార్పొరేషన్లు మున్సిపాల్టీల్లో ఎందుకు అని వారు తీవ్రంగా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విధించిన షరతులకు రాష్ట్రప్రభుత్వం లొంగిపోయి ఎన్ని ఎన్నికల ముందు వైఎస్ఆర్ సీపీ ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలో తొక్కి "మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు"ప్రజలపై ఆస్తి విలువ ఆధారిత పన్ను భారాన్ని మోపిందని వైఎస్ఆర్సిపి చిత్తశుద్ధి ఉంటే నూతనంగా ఎన్నికైన కార్పొరేషన్లు మరియు మున్సిపాలిటీల ప్రత్యేక కౌన్సిల్ సమావేశం జరిపి జిఓ నెంబర్ 196 197 198 పిల్లలు రద్దు చేయాలని వారు తెలిపారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు సిద్ధమవుతోందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రజాసంఘాల నాయకులు మల్లికార్జున గౌడ్,విజయ్ కుమార్,రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకులు రామంజి,రవి,ఖాదర్, సత్య, ఖాదర్,రఫీక్,ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాజీవ్ పాల్గొన్నారు,

## విశాఖ ఉక్కు తెలుగు ప్రజల ఆస్తి అని దీనిని ప్రైవేటీకరణం చేస్తే ఊరుకునేది లేదు సీఐటీయూ



కుక్కునూరు, ఆగస్టు 3 ( విభారె) పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం విశాఖ ఉక్కు తెలుగు ప్రజల ఆస్తి అని దీనిని ప్రైవేటీకరిస్తే తెలుగు ప్రజలు చూస్తూ ఊరుకోరని ఏ.పి.ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ హెచ్చరించారు. మంగళవారం నాడు ఆశ డే సందర్భంగా కుక్కునూరు, అమరవరం పి.హెచ్.సి ల ముందు విశాఖ ఉక్కు కార్మికుల పోరాటానికి మద్దతు తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోశమ్మ మాట్లాడుతూ... విశాఖ ఉక్కు ప్రవేటికరణ అంటే తెలుగు రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసినట్లే అని. ఎంతో కష్టపడి ఆంధ్రుల హక్కుగా విశాఖ ఉక్కును సాధించుకున్నామన్నారు . దీని కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టారన్నారు . 32 మంది ప్రాణ త్యాగం చేశారన్నారు . వేలాది ఎకరాల భూమిని స్టీలు ఫ్యాక్టరీకి ఇచ్చారని , వారిలో ఇప్పటికీ పునరావాసం పొందని రైతులు కూడా ఉన్నారన్నారు . విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించక పోయినా ఉద్యోగుల శ్రమతో ఉన్నత స్థానానికి ఎదిగిందన్నారు . అలాంటి సంస్థకు రూ . 3 లక్షల కోట్ల ఆస్తులున్నాయన్నారు . వీటిని ప్రైవేటు వ్యక్తులకు కారు చౌకగా అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఏకైక భారీ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కారుచౌకగా ప్రైవేటీకరణ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

## విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ అమ్మాలని చూస్తే సహించేది లేదు:- సి ఐ టి యు



నంద్యాల ఆగస్టు 3 ( విభారె) రాష్ట్రంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని చలో పార్లమెంటు చేపట్టిన కార్మికుల,ఉద్యోగుల ఉద్యమానికి మద్దతుగా నంద్యాల లోని నూనెపల్లె-కోవెలకుంట్ల జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ కార్యదర్శి కె మహమ్మద్ గౌస్, సిఐటియు జిల్లా నాయకులు వెంకట లింగం, రాజేష్ ,బాల వెంకట్ లతోపాటు సీఐటీయూ అనుబంధ యూనియన్ నాయకులు పి సి వెంగన్న ,దస్తగిరి ,రాజు ,ఏసన్న రాము,లక్ష్మన్న ,మద్దిలేటి,ప్రతాప్ లతోపాటు వందమంది కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు 32 మంది ప్రాణాలు కోల్పోయిన ఉద్యమకారుల స్పూర్తితో ఏర్పాటైన విశాఖ స్టీల్ ప్లాంట్ ల 100% పెట్టుబడులను విరమించుకుని విదేశీ శక్తులకు మూడు లక్షల కోట్ల విలువ చేసే వాటిని కేవలం 30 వేల కోట్లకు అమ్మడం దుర్మార్గమని అన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ని అమ్మడం సరైంది కాదని, కార్మికులు,ఉద్యోగులు,అన్ని రాజకీయ పార్టీల నాయకులంతా చలో పార్లమెంట్ చేపట్టి 2,3 తేదీలలో నిరసన తెలిపేందుకు వెళ్లిన వారిని అడుగడుగునా నిర్బంధాలకి గురి చేస్తూ అడ్డుకోవడం సరైందికాదని,కేంద్రప్రభుత్వ నిరంకుశ విధానాలను రాష్ట్ర ప్రజలంతా వ్యతిరేకించాలని అన్నారు. రాబోయే కాలంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టి స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## మత్స్యశాఖలో భారీ కుంభకోణం..ఏడు కోట్ల నిధులు స్వాహా


ఏలూరు ఆగస్టు 3 పశ్చిమ గోదావరి జిల్లా మత్స్యశాఖలో భారీ కుంభకోణం వెలుగు చూసింది. ఏడు కోట్ల రూపాయల నిధులను ఇంటి దొంగలు స్వాహా చేశారు. బ్యాంకుల్లో ఉన్న ఫిక్స్డ్ డిపాజిట్లను ఫోర్జరీ సంతకాలతో కొందరు ఉద్యోగులు డ్రా చేశారు. గత ఏడాది కరోనాతో మృతి చెందిన ఒక ఉద్యోగి కీలకపాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శాఖాపరమైన ఆడిట్ చేస్తుండగా స్కామ్ బయటపడింది. పోలీసులకు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. రహస్యంగా పోలీసులు విచారణ చేపట్టారు.

## టాలీవుడ్ ఫస్ట్ రూ.100 కోట్ల 'మగధీర'కు పుష్కరం



టాలీవుడ్ సినిమా 25 నుండి 30 కోట్లు వసూళ్లు చేస్తే చాలా పెద్ద హిట్ అనుకుంటూ ఉన్న సమయంలో... 30 నుండి 40 కోట్లు వసూళ్లు చేస్తే ఇండస్ట్రీ హిట్ అంటూ లెక్కలు ఉన్న సమయంలో 50 కాదు 60 కాదు ఏకంగా 100 కోట్లకు మించిన వసూళ్లు సాధించిన చిత్రం మగధీర. ఈ సినిమా విడుదల అయ్యి పుష్కర కాలం పూర్తి అయ్యింది. ఏదైనా ఒక పుష్కర కాలం ఉంటే దాన్ని గురించి పట్టించుకోవడం మానేస్తారట. కాని మగధీర సినిమా గురించి ఇప్పటికి ఎప్పటికి మాట్లాడుకుంటూనే ఉంటారు. ఎందుకంటే తెలుగు సినిమా పరిశ్రమకు మొదటి వంద కోట్లను పరిచయం చేసిన మూవీ అవ్వడంతో పాటు తెలుగు సినిమా స్థాయిని ప్రపంచానికి చూపించిన సినిమా మగధీర. అందుకే తెలుగు సినీ పరిశ్రమ ఉన్నంత కాలం మగధీర గురించి మాట్లాడుకుంటూనే ఉంటాం అనడంలో సందేహం లేదు.టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన మగధీర సినిమా హీరో రామ్ చరణ్ కు రెండవ సినిమానే. అల్లు అరవింద్ ఈ సినిమాను నిర్మించాడు. అప్పటి వరకు పాతిక కోట్ల బడ్జెట్ అంటే చాలా ఎక్కువ అన్నట్లుగా టాక్ ఉండేది. పాతిక కోట్ల బడ్జెట్ సినిమాను భారీ బడ్జెట్ సినిమాగా భావిస్తున్న తరుణంలో ఈ సినిమాకు దాదాపుగా 35 కోట్లకు మించి బడ్జెట్ ను అల్లు అరవింద్ పెట్టాడు. కొత్త హీరో మీద ఇంత ఖర్చు ఏంటీ బాబోయ్ అన్నట్లుగా కామెంట్స్ వచ్చాయి.ఎంత అల్లుడు అయితే మాత్రం కోట్లు కుమ్మరిస్తారా అంటూ అల్లు అరవింద్ పై అప్పట్లో ఇండస్ట్రీ వర్గాల్లో కామెంట్స్ వచ్చాయి. రాజమౌళి పై నమ్మకంతో పాటు ఆయన చెప్పిన కథపై అల్లు అరవింద్ కు అంతటి నమ్మకం కుదిరింది కనుకే అంతగా పెట్టాడు అనడంలో సందేహం లేదు. అల్లు అరవింద్ పెట్టిన దానికి ఎన్ని రెట్లు వచ్చిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికి కూడా టీవీలో వస్తున్న సమయంలో టీవీలకు అతుక్కు పోయి కూర్చునే వారు ఎంతో మంది ఉంటారు. అలాంటి అద్భుతమైన సినిమా వచ్చి అప్పుడే 12 ఏళ్లు పూర్తి అయ్యింది.రాజమౌళిని దర్శక ధీరుడిగా మార్చిన సినిమా మగధీర. రామ్ చరణ్ ను కేవలం రెండవ సినిమాతో టాలీవుడ్ లో టాప్ హీరోగా నిలబెట్టిన సినిమా మగధీర. కాజల్ ను సుదీర్ఘ కాలం పాటు తెలుగు లో హీరోయిన్ గా కొనసాగేలా చేసిన సినిమా కూడా ఇదే అనడంలో సందేహం లేదు. అంతటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ సక్సెస్ దక్కించుకున్న మగధీర సినిమా ఇంకో రెండు మూడు పుష్కరాల తర్వాత కూడా మాట్లాడుకుంటే అతిశయోక్తిగానే ఉంటుంది. గ్రాఫిక్స్ అవకాశాలు ఎక్కువగా లేని సమయంలో అద్భుతంగా దర్శకుడు రాజమౌళి విజువలైజ్ చేసి తనకున్న పరిజ్ఞానంతో అద్భుతమైన సెట్టింగ్స్ ను వేయించి చక్కగా చూపించాడు.కథ విషయంలో చాలా చిన్న పాయింట్ అయినా కూడా దాన్ని చూపించిన విధానం మరియు దాన్ని మలచిన తీరు ఒక అద్భుతం అంటూ విశ్లేషకులు ఇప్పటికి కూడా మగధీర సినిమా గురించిన ప్రస్థావన వచ్చినప్పుడు వ్యాఖ్యలు చేస్తారు అనడంలో సందేహం లేదు. మగధీర ఇచ్చిన ఉత్సాహంతో రాజమౌళి అంతకు మించిన అద్భుతాలు తెరకెక్కిస్తూ వస్తున్నారు. ఆయన ప్రస్తుతం రామ్ చరణ్ తో ఆర్ ఆర్ ఆర్ సినిమాను చేస్తున్నాడు. ఈ సినిమాలో ఎన్టీఆర్ కూడా ఉన్నాడు. పుష్కర కాలం తర్వాత చరణ్.. రాజమౌళిల కాంబో మూవీ రాబోతుంది. మగధీర సినిమాను మరిపించేలా ఈ కాంబో సినిమా ఉండబోతుంది అనేది కన్ఫర్మ్.

## 'ఆహా కళ్యాణం' బ్యూటీకి ఇక కళ్యాణమే




'ఆహా కళ్యాణం' చిత్రంతో తెలుగు వారికి పరిచయమైన బ్యూటీ వాణీ కపూర్. నాని సరసన నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద వర్కవుట్ కాలేదు. ఆ తర్వాత బాలీవుడ్ లో అసాధారణ విజయాలతో వాణీ దూసుకెళుతోంది. ఇటీవలే వార్ లాంటి బ్లాక్ బస్టర్ మూవీలో నటించిన వాణీ తదుపరి భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.మరోవైపు వరుసగా క్రేజీగా వాణిజ్య ప్రకటనల్లో నటిస్తోంది వాణీ. అలాగే సోషల్ మీడియాల్లోనూ అసాధారణ ఫాలోయింగ్ పెంచుకుంటోంది. వాణీ తాజాగా ప్రఖ్యాత బ్రైడ్స్ టుడే కవర్ పేజీ పై దర్శనమిచ్చింది. బ్రైడ్స్ కోసం రకరకాల భంగిమల్లో వాణీ ఫోటోషూట్ హీట్ పెంచుతోంది. బాలీవుడ్ అందగత్తెల్లో ఐదున్నర అడుగుల ఎత్తుతో ఉండే వాణీ హాటెస్ట్ ఫోజ్ లు ప్రస్తుతం అంతర్జాలాన్ని షేక్ చేస్తున్నాయి. ఇక ఈ ఫోటోషూట్ లో ఆరెంజ్ కలర్ డిజైనర్ లెహెంగాలో వాణీ కిల్లర్ లుక్ తో కట్టి పడేయగా.. ఇతర ఫోటోల్లో వాణీ గ్లామర్ యాంగిల్ ని హాటెస్ట్ గా ఎలివేట్ చేశారు.'ఆహా కళ్యాణం' బ్యూటీ హాటెస్ట్ పెళ్లికూతురునే తలపిస్తోంది! అంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. 'సలార్' విలన్ వైఫ్ పాత్రలో వార్ బ్యూటీ వాణీ కపూర్ నటిస్తోందన్న ప్రచారం సాగుతోంది. రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా 'కేజీఎఫ్' దర్శకుడు ప్రశాంత్ నీల్ 'సలార్' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కొద్ది భాగం షూటింగ్ కూడా జరిగింది. త్వరలోనే కొత్త షెడ్యూల్ ప్రారంభం కాబోతుంది. ఇప్పటికే ప్రభాస్ కి విలన్ గా ఓ ప్రముఖ నటుడిని లాక్ చేశారని ప్రచారమైంది. ఇందులో విలన్ వైఫ్ పాత్ర కూడా కథలో అంతే కీలకంగా ఉండనుందని తెలుస్తోంది. కీలకమైన విలన్ వైఫ్ పాత్ర కోసం వార్ బ్యూటీ వాణీ కపూర్ ని ఫైనల్ చేసినట్లు కథనాలొచ్చాయి.

## స్టార్స్ తో సినిమాలు చేయకపోడానికి కారణమేంటో చెప్పిన ఎమ్.ఎస్. రాజు

టాలీవుడ్ సీనియర్ ప్రొడ్యూసర్ ఎమ్.ఎస్ రాజు గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. 'శత్రువు' 'మనసంతా నువ్వే' 'వర్షం' 'ఒక్కడు' 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలను రూపొందించారు. ఒకప్పుడు స్టార్ ప్రొడ్యూసర్ గా చెలామణి అయిన ఎమ్మెస్ రాజు.. ప్రభుదేవాని డైరెక్టర్ గా.. దేవిశ్రీ ప్రసాద్ ని మ్యూజిక్ డైరెక్టర్ గా పరిచయం చేశాడు. త్రిష - సిద్ధార్థ్ వంటి వారికి స్టార్ స్టేటస్ వచ్చేలా చేశాడు. మహేష్ బాబు కెరీర్ లో ఫస్ట్ బ్లాక్ బస్టర్ 'ఒక్కడు' చిత్రాన్ని నిర్మించిన సీనియర్ నిర్మాత.. 'వర్షం' చిత్రంతో ప్రభాస్ ని స్టార్ ని చేశాడు. 'మస్కా' సినిమా తర్వాత ఇండస్ట్రీకి దూరమైన ఎంఎస్ రాజు.. చాలా గ్యాప్ తర్వాత 'డర్టీ హరి' అనే సినిమాతో డైరెక్టర్ గా వచ్చాడు. ఇప్పుడు దర్శకుడిగా నాలుగో సినిమా "7 డేస్ 6 నైట్స్" తో



ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు.'డర్టీ హరి' సినిమా ఫలితం గురించి మాట్లాడుతూ "సినిమాని అందరూ మెచ్చుకున్నారు. ఓటీటీలో మంచి హిట్స్ వచ్చాయి. ఇది నాకు ప్రాఫిటబుల్ వెంచర్. నేను ట్రెండ్ కి తగ్గట్లుగా విభిన్నమైన సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తున్నాను. నేను 'డర్టీ హరి' పోస్టర్స్ చూసిని చాలా మంది అనేక రకాలుగా మాట్లాడుకున్నారు. కానీ సినిమా చూసిన తర్వాత చాలా బాగుందని ప్రశంసించారు. సినిమాకు ముందు ఉన్న నెగెటివ్ కూడా చూసిన తర్వాత పాజిటివ్ అయింది. అలానే కొందరు ఇలాంటి సినిమా మీరు ఎలా తీశారని ఆశ్చర్యపోయారు" అని ఎమ్.ఎస్ రాజు చెప్పారు."7 డేస్ 6 నైట్స్ సాఫ్ట్ అండ్ బ్యూటీఫుల్ ఫిల్మ్. ఇందులో న్యూ ట్రెండీ థింగ్స్ ఉంటాయి. సినిమా టైటిల్ చూసి రకరకాల కథలు పుట్టుకొచ్చాయి. ఇది హీరోహీరోయిన్ల మీద నడిచే సినిమా కాదు. పాత్రల మధ్య ఉండే చక్కటి ఎమోషన్స్ తో నడుస్తుంది. యూత్ ట్రెండ్ కి తగ్గట్టుగా ఉంటుంది. మా పిఆర్ టీమ్ నా కొడుకు కనిపించే విధంగా పోస్టర్ విడుదల చేద్దామని నాకు సలహా ఇచ్చాడు. కానీ నేను వద్దు అన్నాను. స్టోరీ పరంగానే వెళదామని వాళ్లతో చెప్పాను. 'అవతార్' సినిమాలో హీరోహీరోయిన్ల పేర్లు ఎవరికి తెలుసు? కేవలం జేమ్స్ కామెరాన్ పేరు చూసి మనం సినిమాకి వెళ్ళాం. ఇప్పటి వరకు ఏ సినిమా దాని కలెక్షన్స్ బీట్ చేయలేకపోయింది. నేను పాముని పెట్టి 'దేవి' అనే సినిమా తీసాను. సూపర్ హిట్ అయింది. నేను అదే కాన్ఫిడెంట్ తో ఉంటాను. స్టోరీని పాత్రలను మాత్రమే నమ్ముతాను. ఇందులో మా అబ్బాయి ఒక పాత్రకు సూట్ అయ్యాడు కాబట్టే తీసుకున్నాను. ఈ సినిమాతో 16మంది కొత్తవాళ్లను పరిచయం చేస్తున్నాను" అని ఎమ్మెస్ రాజు అన్నారు.

## టీమిండియాదే ఈ సిరీస్: మైకేల్ వాన్




లండన్: ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లండ్ జట్టు భారత పర్యటనకు వచ్చినపుడు పిచ్‌లపై తన వైఖరి వెల్లడిస్తూ ట్రోలింగ్ బారిన పడ్డాడు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్. ముఖ్యంగా చెన్నై, అహ్మదాబాద్ పిచ్‌ల గురించి తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ టీమిండియా సామర్థ్యంపై సెటైర్లు వేస్తూ అభిమానుల ఆగ్రహానికి గురయ్యాడు. ఇక ప్రస్తుతం భారత్ టెస్టు సిరీస్ కోసం ఇంగ్లండ్ టూర్ కు వెళ్లిన సంగతి తెలిసిందే. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం నుంచి తొలి టెస్టు ఆరంభం కానుంది. ఈ నేపథ్యంలో క్రిక్‌బజ్‌తో మాట్లాడిన మైకేల్ వాన్.. ఈసారి మాత్రం సిరీస్ టీమిండియాదే అంటూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. ఈ విషయం చెప్పడానికి తానుఇష్టపడనప్పటికీ... ప్రస్తుత బలబలాల ఆధారంగా భారత జట్టుకే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పుకొచ్చాడు. ఈ మేరకు.. "నా అభిప్రాయాలు, అంచనాలు కొన్నిసార్లు నిజం కావచ్చు. మరికొన్ని సార్లు తప్పు కావచ్చు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో బెన్ స్టోక్స్ గైర్హాజరీలో ఇంగ్లండ్ ఓడిపోయింది. ప్రస్తుత సిరీస్‌లో ఈసారి టీమిండియాదే విజయం. వాళ్లకే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో రెండుసార్లు చేరువగా వచ్చినా ఓడిపోయారు. ఇప్పుడు స్టోక్స్ లాంటి కీలక ఆటగాడు లేకుండానే ఇంగ్లండ్ పోటీలోకి దిగనుంది. తను లేకుండా బాలెన్స్ చేయడం కష్టం. ఆల్‌రౌండర్‌లేని కారణంగా ఓ బ్యాటర్, బౌలర్‌ని మిస్ అవుతారు. కాబట్టి జో రూట్ సేనకు కష్టమే. ఆగస్టు, సెప్టెంబరులో స్పిన్ మాయాజాలమే పనిచేస్తుంది. కాబట్టి ఈ విషయం చెప్పడానికి నేను ద్వేషిస్తున్నా.. అయినా 3-1తేడాతో టీమిండియా తప్పక ఈ సిరీస్ గెలుస్తుంది" అని అభిప్రాయపడ్డాడు. కాగా తాను మానసిక ఆందోళనకు గురవుతున్న సాంత్వన పొందేందుకు క్రికెట్‌కు 'నిరవధిక విరామం' ఇస్తున్నట్లు ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190